

అలంకరణలో బాబా మహాసమాధి, ఫ్లూట్ వాయిస్తున్న అనిర్బాన్‌రాయ్

హ్యాండ్‌లూమ్ క్లస్టర్‌కు భూమి కేటాయింపు

ధర్మవరం రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మెగా హ్యాండ్ లూమ్ క్లస్టర్ ఏర్పాటు కోసం ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. ధర్మవరంలో మెగా హ్యాండ్‌లూమ్ క్లస్టర్ ఏర్పాటు కోసం ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. క్లస్టర్ కోసం ధర్మవరంలోని వ్యవసాయమార్కెట్‌యార్డులో సర్వేనెంబర్ 65లో 9.84ఎకరాల భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం గురువారం జీవో జారీ చేసినట్లు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులు తెలిపారు. ఈ భూమిని 25సంవత్సరాల పాటు నెలకు రూ.10వేల చొప్పున అద్దె చెల్లించేలా ఒప్పందం జరిగినట్లు జీవోలో స్పష్టం చేశారు.


GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT
AGRICULTURE AND COOPERATION (MKTG-I) DEPARTMENT
ORDER:
(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF ANDHRA PRADESH)
EX-OFFICIO SPECIAL CHIEF SECRETARY TO GOVERNMENT

ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వు

చిల్డ్రన్ పార్క్ ప్రారంభం


పార్క్‌లో మొక్కనాటుతున్న మంత్రి సవిత, జోయాలుకాస్ ఎండీ జాయ్, కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, పల్లె రఘునాథరెడ్డి

పుట్టపర్తి రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జోయాలుకాస్ సంస్థ సామాజిక బాధ్యత అభినందనీయమని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. జోయాలుకాస్ సంస్థ రూ.1.2కోట్ల వ్యయంతో పుట్టపర్తిలో చిత్రావతి నది ఒడ్డున ఏర్పాటు చేసిన చిల్డ్రన్ పార్కు ప్రారంభోత్సవం గురువారం నిర్వహించారు. ఈపార్క్‌ను జోయాలుకాస్ ఎండీ జాయ్ లుకాస్ ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా మంత్రి సవిత, సత్యసాయి సెంట్రల్‌ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్ ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథ రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా మంత్రి సవిత, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి మాట్లాడుతూ బాబామీద భక్తితో సామాజిక బాధ్యతగా పార్క్ నిర్మాణానికి ముందుకు వచ్చిన జోయాలుకాస్ వారిని అభినందిస్తున్నట్లు తెలిపారు. బాబా జయంతి వేడుకల నేపథ్యంలో పెద్దలకు ఆహ్లాదాన్ని, చిన్నపిల్లలకు ఆనందాన్ని అందించే క్రమంలో చిల్డ్రన్‌పార్క్ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. మాజీమంత్రి పల్లె మాట్లాడుతూ పక్కవారికి మంచిచేయాలన్న తలంపు ఉంటే అద్భుతాలు జరుగుతాయనేందుకు జోయాలుకాస్ వారు ఏర్పాటు చేసిన పార్కే నిదర్శనమన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్మన్ ఓబుళపతి, కేరళ మాజీ డీజీపీ శంకర్‌రెడ్డి దంపతులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


నారాయణసేవలో పాల్గొన్న భక్తులు

సాయి నారాయణా..!

సత్యసాయి శత జయంతి

వేడుకలు ప్రారంభం

- మహా సమాధికి ప్రత్యేక అలంకరణ.. పూజలు
- బెంగళూరు బృందావనం నుంచి సైకిల్ యాత్ర
- ప్రశాంతి నిలయంలో అలరించిన ప్రదర్శనలు
- నారాయణ సేవను ప్రారంభించిన ఆర్‌జే రత్నాకర్


విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు


సత్యసాయి చిత్రపటానికి హారతి ఇస్తున్న రత్నాకర్


వంటకు కూరగాయలు సిద్ధం చేస్తున్న భక్తులు

పుట్టపర్తి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): భక్తులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సత్యసాయి శత జయంతి వేడుకలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రశాంతి నిలయంలో సత్యసాయి విద్యార్థులు సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. విద్యార్థుల వేద పఠనంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. వేడుకల్లో పాల్గొంటున్న భక్తులకు నారాయణ సేవను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ ప్రారంభించారు. ఈ నెల 24 వరకు 12 రోజుల పాటు సాగే నారాయణ సేవ కోసం 200 మంది వంట మనుషులు, 500 మంది సహాయకులు సేవలు అందిస్తారు. శత జయంతి ఉత్సవాల గ్యాస్ బెలూన్‌ను రత్నాకర్ ఎగురవేశారు.


సైకిళ్లపై పుట్టపర్తి చేరుకున్న విద్యార్థులు

భక్తి నివేదన

సైక్లోన్ సభా మండపంలో సాయంత్రం అనిర్బాన్ రాయ్ ఫ్లూట్ వాయిద్యం, సత్యసాయి హయ్యర్ సెకండరీ స్కూల్ విద్యార్థులు సంగీత, సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరించాయి. వేలాది మంది భక్తులు సత్యసాయి సమాధిని దర్శించుకున్నారు. సత్యసాయి శత జయంతి వేడుకలకు బెంగళూరులోని బృందావన క్యాంపస్ విద్యార్థులు 150 మంది సైకిల్ యాత్రతో భక్తి నివేదనను చాటారు. వంద మైళ్ల దూరం సైకిళ్లపై ప్రయాణించి గురువారం సాయంత్రానికి ప్రశాంతి నిలయానికి చేరుకున్నారు. హిల్‌వ్యూ స్టేడియంలో సత్యసాయికి మంగళహారతి ఇచ్చి, యాత్రను ముగించారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ రాఘవేంద్ర ప్రసాద్, రిజిస్ట్రార్ శ్రీకాంత్ ఖన్నా, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

నేడు ప్రశాంతి నిలయంలో..

సత్యసాయి జయంతి వేడుకల్లో రెండో రోజు శుక్రవారం సాయికుల్వంత్‌లో కుమారి రూప సితారు వాయిద్య ప్రదర్శన ఉంటుంది. భక్తులకు నారాయణసేవ కొనసాగుతుంది. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

కమాండ్ కంట్రోల్ రూము ఏర్పాటు

- విధులపై అవగాహన ఉండాలి: కలెక్టర్
- అప్రమత్తంగా వ్యవహరించాలి: ఎస్పీ

పుట్టపర్తి టౌన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తిలో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూములో విధుల నిర్వహణపై సిబ్బంది అందరూ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ శ్యాంప్రసాద్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ పేర్కొన్నారు. సత్యసాయి జయంతి ఉత్సవాల నేపథ్యంలో ఏర్పాటుచేయనున్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూములో విధుల నిర్వహణపై గురువారం పుట్టపర్తిలోని సాయిఆరామంలో వివిధశాఖల అధికారులు, పోలీసు అధికారులు, సిబ్బందికి ఒకరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజాభద్రతను మరింత మెరుగుపరచడం, యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మంచి భక్తి అనుభవాన్ని కలిగించడమే ఈ కంట్రోల్ రూము ఏర్పాటు ఉద్దేశ్యమన్నారు. కమాండ్ కంట్రోల్ రూములో 24 గంటలు విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూములో పని చేసేవారు సీసీటీవీ ఫీడ్, డ్రోన్ సాయంతో సేకరించిన సమాచారం ఆధారంగా గుర్తించిన సమస్యలను తగిన ప్రతిస్పందన బృందాలకు (భద్రత, వైద్య తదితర) బదిలీచేయడం, కమ్యూనికేషన్‌ను క్రమబద్ధీకరించడం, సత్వర, సమర్థవంతమైన చర్య లు తీసుకునేలా చూడాల్సి ఉంటుందన్నారు. మొ త్తం 176 సీసీ టీవీ కెమెరాలు, 8 డ్రోన్లు, వందమంది సిబ్బందితో మూడు షిఫ్టులుగా ఈ కంట్రోల్ రూమును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది నిరంతరం అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో జాయిం ట్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, ఆర్డీఓ సువర్ణ, డీఎఫ్ఓ చక్రపాణి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, చిత్రంలో ఎస్పీ, జాయింట్ కలెక్టర్

విలువలే పాఠాలుగా..!

- సత్యసాయి విద్యాసంస్థలు దేశానికే తలమానికం


6

పోలీసు పహారాలో...

- శతజయంతికి హాజరు కానున్న రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధాని
- పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్న పోలీసులు


మ్యాట్రిక్స్ కెమెరాలు

6

ఆర్పీల నియామకంలో దందా

- ఆన్‌లైన్ పేరుతో అక్రమాలు
- సొమ్ములిచ్చిన వారికే నియామకం
- చక్రం తిప్పుతున్న ఓ ఆర్పీ


ధర్మవరం మున్సిపల్ కార్యాలయం

ధర్మవరం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలో మహిళా పొదుపు సంఘాలను నిర్వహించే ఆర్పీ(రీసోర్స్‌పర్సన్)ల నియామకాల్లో వసూళ్ల దందా నడుస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైసీపీ పాలనలో ఆర్పీలుగా పని చేసినవారు స్వచ్ఛందంగా తప్పుకున్నారు. దీంతో కూటమి పార్టీ నాయకులు తమ పార్టీల సానుభూతిపరులను ఆర్పీలుగా ఎంపిక చేశారు. ఇలా బీజేపీకి 18, టీడీపీకి 38, జనసేనకు 10 మందిని నూతన ఆర్పీలుగా ఎంపిక చేసుకున్నారు. కూటమి నాయకులు పంపిన జాబితాను పుట్టపర్తి మెప్మా పీడీ కార్యాలయం అధికారులు గతనెలలో పరిశీలించారు. అనంతరం తాము ఆన్‌లైన్‌లో మీ వివరాలను పొందుపరిచి సమాచారాన్ని అందజేస్తామని ఆశావహులకు చెప్పినట్లు సమాచారం. ఆర్పీలుగా ఎంపికైన వారి పేరు, వివరాలు ఆన్‌లైన్‌లో నమోదైతేనే వారికి ప్రభుత్వం నుంచి జీతభత్యాలు, ఇతర అలవెన్సులు వస్తాయి.



అయితే బీజేపీ సానుభూతిపరులైన 18 మందికి ఆర్పీలుగా ఎంపికైనట్లు సమాచారం వచ్చింది. టీడీపీ సానుభూతిపరులు 17 మందిని మాత్రమే ఆన్‌లైన్‌లోకి పొందుపరిచి మిగిలినవి డాక్యుమెంట్స్ సరిగా లేవని చెబుతున్నట్లు సమాచారం. జనసేన సానుభూతిపరులు ఒకరిని మాత్రమే ఆర్పీగా ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. మెప్మా సిబ్బంది నిర్లక్ష్యంగా వల్లే తమకు అన్యాయం జరుగుతోందని పలువురు ఆర్పీలుగా ఎంపికైనవారు మండిపడుతున్నారు.

రూ.10వేలు ఇస్తే చేయిస్తా

మెప్మాలో ఆర్పీలుగా నియామకం కావాలంటూ ఒక్కొక్కరు రూ.10వేలు ముట్టచెప్పితే పని చేయిస్తానంటూ బీజేపీ సానుభూతిపరురాలైన ఓ ఆర్పీ ప్రతిపాదన పెట్టినట్లు సమాచారం. మెప్మా సిబ్బందితో ఆ ఆర్పీ కుమ్మక్కై ఈ దందాకు తెరలేపినట్లు తెలిసింది. ఈ ఆర్పీ 2014-19 మధ్యకాలంలో మహిళా సంఘాల రుణాలలో భారీ అవినీతికి పాల్పడి కేసుల్లో సైతం ఇరుక్కున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి వాటి వల్ల కూటమి పార్టీలకు చెడ్డపేరు వస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మీ డ్యాక్యుమెంట్లలో తప్పు లున్న ఆర్పీలుగా నియమించేలా చూస్తానని కొంత మంది ఆర్పీలతో ఒక్కొక్కరి నుంచి రూ.50వేలు వసూలు చేసినట్లు సమాచారం.


మెప్మా విభాగం

ఆధారాలు ఇస్తే చర్యలు తీసుకుంటాం

ధర్మవరం మున్సిపాలిటీలో ఆర్పీలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు డబ్బు వసూలు చేస్తున్న విషయం నా దృష్టికి రాలేదు. ఆర్పీలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ఎవరికీ పైసా ఇవ్వవలసిన అవసరం లేదు. అలా ఎవరైనా వసూలు చేస్తుంటే, ఆధారాలతో మా దృష్టికి తెస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

-పద్మావతి, పీడీ, మెప్మా, శ్రీ సత్యసాయిజిల్లా

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత


ఎన్నికైన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మంత్రి

పెనుకొండ టౌన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్త, నాయకుడు కృషి చేయాలని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం క్లస్టర్, యూనిట్, గ్రామ బూత్ కమిటీ ప్రమాణ స్వీకారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి సవిత, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అంతకుముందు వారు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి అక్కడి నుంచి పార్టీ కార్యాలయానికి ర్యాలీగా వచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఐదేళ్లుగా వైసీపీ ఎన్ని ఇబ్బందులు పెట్టినా వాటన్నింటిని తట్టుకుని పార్టీ గెలుపునకు కష్టపడిన ప్రతి టీడీపీ కుటుంబ సభ్యుడికి రుణపడి ఉంటామన్నారు. టీడీపీ ఒక యూనివర్సిటీ అని ఎందరో నాయకులను తయారుచేసిన పార్టీ అని కొనియాడారు. ఐదేళ్ల పాలనలో వైసీపీ నాయకులు ఏనాడు ప్రజల్లోకి పోలేదని, మనం నిత్యం ఏదో ఒక కార్యక్రమంతో ప్రజల వెంటే ఉంటున్నామన్నారు. గత 17నెలల్లో నెలకు 10రోజుల పాటు నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉన్నానని త్వరలో మరింత సమయం కేటాయిస్తానన్నారు. ఇక నుంచి నిత్యం ప్రతి కార్యకర్త, నాయకుడు 17నెలల్లో జరిగిన అభివృద్ధిని ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని సూచించారు. మాజీ మంత్రులు గత ఐదేళ్లలో వారి నియోజకవర్గాల్లో ఏం అభివృద్ధి చేశారో ఈ 17నెలల్లో తాను ఏ అభివృద్ధి చేశానో చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. చిన్న చిన్న పొరపాట్లు జరిగితే సరిదిద్దుకుంటూ ముందుకెళ్తామన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన వార్డు ఇన్‌చార్జులతో మంత్రి, జిల్లా అధ్యక్షుడు ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాల్మీకుల అభివృద్ధికి కృషి

- ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ


కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యేలు

గుడిబండ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వాల్మీకుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, ఎంఎస్ రాజు అన్నారు. గుడిబండలో వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో గురువారం వారు పాల్గొన్నారు. రామాయణాన్ని రచించిన మహనీయుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించడం అభినందనీయమని అన్నారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస మూర్తి, వక్కళిగ కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, టీడీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, సింగిల్ విండో అధ్యక్షుడు మద్దనకుంటప్ప తదితరులు పాల్గొన్నారు.

ఒంటరి మహిళకు వేధింపులు

- వైసీపీ వర్గీయుడి అనుచిత ప్రవర్తన

ధర్మవరం రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నేలకోట తండాలో ఓ ఒంటరి మహిళతో వైసీపీ వర్గీయుడు అనుచితంగా ప్రవర్తించాడు. మద్యం సేవించి, బుధవారం అర్ధరాత్రి ఆమె ఇంటి తలుపులను తట్టాడు. తలుపులు తీయగానే ఇంట్లోకి చొరబడి, అసభ్యకరంగా మాట్లాడాడు. దీంతో తేరుకున్న ఆమె ఆ యువకుడిని బయటకు తోసేసి తలుపులు వేసుకున్నారు. బాధితురాలు గురువారం ఉదయం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు స్పందించకపోవడంతో ఆమె స్టేషన్ నుంచే డయల్ 100కి సమాచారం ఇచ్చారు. అయినా సాయంత్రం వరకు ఆమె స్టేషన్ వద్దే పడిగాపులు కాశారు. దీంతో నిందితుడిని సాయంత్రం పిలిపించి, దుప్పటి పంచాయితీ చేసి పంపించారని తెలిసింది. జరిగిన సంఘటనపై విచారిస్తున్నామని, వేధింపులు వాస్తవమని తేలితే చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

సారూ... ఇదేం తీరు..?

- పైసలిస్తేనే పనులు
- సిబ్బంది పనుల్లో జోక్యం
- వివాదాలకు నిలయంగా కార్యాలయం

మండలస్థాయి అధికారి ఇష్టారాజ్యం



నల్లచెరువు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల స్థాయి అధికారి తీరు సర్వత్రా వివాదాస్పదమవుతోంది. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పైసలిస్తే తప్ప.. పనులు చేయరనీ, కార్యాలయ సిబ్బంది విధుల్లో జోక్యం చేసుకుంటారనీ, వారితో విభేదాలు తారాస్థాయికి చేరినట్లు మండల వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. చిన్న ధ్రువీకరణ పత్రంపై కూడా సంతకం పెట్టకుండా వేధిస్తుండడంతో మండల వాసులు విసిగిపోతున్నారు. అధికారి, సిబ్బంది మధ్య విభేదాల కారణంగా కార్యాలయం వివాదాల నిలయం అవుతోంది. విద్యార్థులకు అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలకు సైతం కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోంది. రైతుల పరిస్థితి వేరే చెప్పాల్సిన పని లేదు. హోల్డ్‌లో పెట్టిన భూములు రిజిస్ట్రేషన్ కాక కొందరు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వివాదాల అధికారితో హోల్డ్ తొలగింపజేసుకోవాలంటే తలకు మించిన పనేనని రైతులు వాపోతున్నారు. దీంతో విసిగిపోయిన రైతులు.. ఆఫీసులోనే గొడవకు దిగుతున్నారు. కంప్యూటర్ రూమ్‌నే తన చాంబర్‌లోకి మార్చుకున్నారంటే ఆ అధికారి తీరును అర్థం చేసుకోవచ్చు. తన చాంబర్‌లోనే కంప్యూటర్ ఆపరేటర్లు విధులు నిర్వర్తించాలని హుకుం జారీ చేశారట ఆ అధికారి.

ఆఫీసులోనే గొడవలు



మండలస్థాయి అధికారి కార్యాలయం తరచూ వివాదాలకు నిలయమవుతోంది. గ్రామాల్లో కొందరు రైతులకు సంబంధించిన పాసు పుస్తకాల్లో భూమి ఒకరిది.. ఆన్‌లైన్‌లో మరొకరి పేరు నమోదు చేసి ఉంటారు. ఆ భూమి తమదంటే తమదని రైతులు గొడవలు పడుతూ పోలీసు స్టేషన్లకు వెళ్లారు. ఇటీవల ఓరువాయి పంచాయతీకి చెందిన ఓ రైతు తన భూమిని వేరొకరి పేరు మీద ఆన్‌లైన్ చేశారంటూ ఏకంగా ఆఫీసులోనే పురుగుల మందు తాగి, ఆత్మహత్యకు యత్నించాడు.

సిబ్బందితో విభేదాలు



మండలస్థాయి అధికారికి.. కార్యాలయంలో పని చేసే సిబ్బందితో విభేదాలు తారాస్థాయికి చేరాయన్న చర్చ సాగుతోంది. సిబ్బంది పనుల్లో కూడా అధికారి జోక్యం చేసుకుని, వారి విధులకు ఆటంకం కలిగిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తమ విధుల్లోకి కూడా అధికారి జోక్యం చేసుకుంటున్నపుడు తామెందుకని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది.

ప్రతి పనికీ ఓ రేటు..



మండల కార్యాలయంలో ప్రతి పనికీ ఓ రేటు నిర్ణయించినట్లు సిబ్బంది బహిరంగంగా చర్చించుకుంటున్నారు. పాసుపుస్తకం కావాలంటే రూ.15వేల నుంచి రూ.20వేలు, 1బీ హోల్డ్ తీయాలంటే రూ.1500 నుంచి రూ.2 వేలు, పొలంలోకి వెళ్లి సర్వే చేయించాల్సి వస్తే విస్తీర్ణం బట్టి రూ.5వేల నుంచి రూ.10వేల వరకు గుంజుతున్నట్లు అన్నదాతలు వాపోతున్నారు. ఈ తతంగం అంతా కదిరిలోని ఓ ప్రైవేటు గదిలో నడుస్తోందని రైతులు పేర్కొంటున్నారు. ఆ అధికారి తీరుపై మండల ప్రజలు తీవ్రంగా మండిపడుతున్నారు.

డీకేటీ భూములు కూడా..



మండలంలోని ఊబిచెర్ల పంచాయతీకి చెందిన ఒక వ్యక్తి గ్రామంలో ఉన్న డీకేటీ భూములపై కన్నేసి వీఆర్వోపై ఒత్తిడి తేవడంతో ఆయన ససేమిరా అన్నారు. దీంతో సదరు వ్యక్తి.. నేరుగా మండల అధికారి వద్దకెళ్లాడు. తాను పనిచేసి పడతానంటూ ఆ అధికారి చర్యలు మొదలెట్టినట్లు తెలుస్తోంది. అప్పుడే కొంత అడ్వాన్సుగా కూడా తీసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పిత్రార్జిత భూముల ఆన్‌లైన్‌కూ పైసలు

గ్రామాల్లో కొందరు రైతులకు తల్లిదండ్రుల నుంచి సంక్రమించిన భూములను ఆన్‌లైన్ చేయాల్సిందే. అందులోనూ రైతులకు ఇబ్బంది తప్పడం లేదు. అధికారి గ్రామాల్లో విచారించి, చట్టపరమైన హక్కు ఉన్న వారికి ఆన్‌లైన్ చేయాల్సింది పోయి.. పిత్రార్జిత భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు లేనిది ఆన్‌లైన్ చేయమని తెగేసి చెప్పడంతో చేసేది లేక వెనుదిరుగుతున్నారు. ఒరిజినల్ డాక్యుమెంట్లతో వస్తేనే ఆన్‌లైన్ చేస్తామని చెప్పడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, ఏఎస్పీ అంకిత మహావీర్

పోలీసు పహారాలో పుట్టపర్తి

- బాబా శతజయంతికి హాజరుకానున్న రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధాని
- పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

పుట్టపర్తిరూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పోలీసు పహారాలో పుట్టపర్తి కొనసాగుతోంది. సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలకు దేశంలోని ప్రముఖులు హాజరవుతున్న నేపథ్యంలో పుట్టపర్తిలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈనెల 19న భారత ప్రధాని నరేంద్రమోదీ, 22, 23 తేదీల్లో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ పుట్టపర్తికి రానున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎస్పీ సతీష్‌కుమార్ పర్యవేక్షణలో వారం రోజులుగా పట్టణంలో అణువణువు తనిఖీ చేస్తున్నారు. అత్యాధునిక కెమెరాలు, డ్రోన్లు, నైట్ విజన్ పరికరాలతో ద్వారా రాత్రిపూట నిఘా కొనసాగుతోంది. పట్టణంలోని ప్రధాన రహదారులు, ప్రవేశద్వారాలు, విమానాశ్రయం, హెలీప్యాడ్, ప్రశాంతినిలయం, సాయికుల్వంత్ సభామండపం, హిల్‌వ్యూ స్టేడియం ప్రాంతాల్లో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రేహౌండ్స్ స్పెషల్‌పార్టీ పోలీసులు, బాంబ్‌స్క్వాడ్, డాగ్‌స్క్వాడ్, సాయుధబలగాలతో ప్రత్యేక నిఘా ఏర్పాట్లు జరుగుతున్నాయి. పట్టణంలోకి వచ్చే వాహనాలపై చెకింగ్ పాయింట్ల వద్ద తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రధాన వీధులు, వీఐపీ మార్గాలపై పోలీసులు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ గురువారం మాట్లాడుతూ వీవీఐపీల భద్రతను దృష్టిలో ఉంచుకుని పటిష్ట బందోబస్తు చర్యలను చేపడుతున్నామన్నారు. సత్యసాయి జయంతి వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ తరఫున కృషి చేస్తున్నట్లు తెలిపారు.

విలువలే పాఠాలుగా..!

- మానవత్వం, సేవ, క్రమశిక్షణకు ప్రాధాన్యం
- కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య
- సత్యసాయి విద్యాసంస్థలు దేశానికే తలమానికం



శ్రీసత్యసాయి హయ్యర్ సెకండరీ స్కూల్



శ్రీసత్యసాయి డీమ్డ్ యూనివర్శిటీ భవనం

పుట్టపర్తి రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): భూమిపై నడయాడిన భగవంతుడిగా కీర్తి గడించిన సత్యసాయి బాబా విద్యకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చారు. అక్షరమే విజ్ఞాన సాధనమని భావించి దశాబ్దాల కిందటే విద్యాసంస్థల ఏర్పాటుకు పునాది రాయి వేశారు. విలువలే పాఠాలుగా విద్య అందించాలని ఓ నూతన విద్యా వ్యవస్థను రూపొందించారు. ఈ విద్యా సంస్థల్లో మానవత్వం, సేవ, క్రమశిక్షణను పాఠ్యాంశాలకు జతగా బోధిస్తూ దేశానికే తలమానికంగా తీర్చిదిద్దారు. ఆధునిక విద్యావ్యవస్థలో ఎన్ని మార్పులొచ్చినా.. ఎన్ని విపరీత పోకడలు వచ్చినా, సత్యసాయి విద్యావిధానంలో నేటికీ విలువలే ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి. ఇక్కడ కేజీ నుంచి పీజీ వరకు పూర్తి ఉచితంగా విద్య బోధిస్తున్నారు.

1981లో ప్రారంభం

భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, మానవతా విలువలను మేళవించి నాణ్యమైన విద్యాప్రమాణాలను అందించడంలో సత్యసాయి విశ్వవిద్యాలయం విశిష్టస్థానం సంపాదించింది. 1981లో సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ (శ్రీసత్యసాయి యూనివర్శిటీ) స్థాపించారు. విశ్వవిద్యాలయం పరిధిలో ప్రశాంతినిలయం, అనంతపురం మహిళా కళాశాల, బెంగళూరులోని బృందావనం, నందగిరి ప్రాంగణం ఉన్నాయి. సత్యసాయి డీమ్డ్ యూనివర్శిటీకి 1986లో ఇండియన్ యూనివర్శిటీ అసోసియేషన్‌లో శాశ్వత సభ్యత్వం లభించింది.

ప్రవేశం ఇలా..

విశ్వవిద్యాలయ ప్రవేశానికి రాత, మౌఖిక, లాటరీ విధానాల్లో విద్యార్థులను ఎంపిక చేస్తారు. డిసెంబరు మొదటివారం నుంచి ఫిబ్రవరి చివరి వారం వరకు దరఖాస్తులు అందజేస్తారు. మార్చి చివరి నాటికి దరఖాస్తులు అందజేయాల్సి ఉంటుంది. ఏప్రిల్ రెండోవారంలో రాతపరీక్షలు, లాటరీ నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేస్తారు. జూన్ మొదటివారంలో ప్రవేశాలు కల్పిస్తారు. జూన్ 10 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

వస్త్రధారణ, పరిశోధనలు, క్రీడలకు పెద్దపీట

సత్యసాయి విద్యాసంస్థల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. సంప్రదాయ వస్త్రధారణ, క్రమశిక్షణతో కూడిన నడవడిక, నిత్యపరిశోధన, సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలకు పెద్దపీట వేస్తున్నారు. కంప్యూటర్ శిక్షణ, అత్యాధునిక పరిశోధన, యోగా కేంద్రాలు, లక్షలాది పుస్తకాలతో కూడిన అత్యాధునిక లైబ్రరీ సత్యసాయి విద్యాసంస్థల సొంతం. విద్యార్థులకు సాహస క్రీడల్లో తర్ఫీదు ఇస్తున్నారు. ఏటా జనవరి 11న నిర్వహించే సాంస్కృతిక క్రీడోత్సవంలో ప్రదర్శించే సాహసోపేతమైన విన్యాసాలు ఆహూతులను అబ్బురపరుస్తాయి.



శ్రీసత్యసాయి పీజీ కళాశాల

2002లో నాక్ ఏ++గ్రేడ్ ఇచ్చి దేశంలోనే ఉన్నత విద్యాలయాల సరసన చేర్చింది. 2009లో శ్రీసత్యసాయి డీమ్డ్ యూనివర్శిటీగా అవతరించింది.

ఇవీ కోర్సులు

యూజీ విభాగంలో బీఎస్సీ ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఫైనాన్స్, ఎకనామిక్స్, డేటా సైన్స్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్, బీఏలో హానర్స్ ఇన్ ఎకనామిక్స్, బీకాంలో బీకాం హానర్స్, బీబీఏ బీఈడీ కోర్సులున్నాయి. పీజీలో ఎంబీఏ రెండు సంవత్సరాల ప్రోగ్రాం, ఎమ్మెస్సీ మ్యాథమాటిక్స్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్, బయోసైన్స్, ఎంటెక్‌లో అప్లైడ్ ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్, కంప్యూటర్ సైన్స్, ఎంఏ ఇంగ్లిష్, ఇంగ్లిష్ లిటరేచర్, పీహెచ్‌డీ కోర్సులున్నాయి.

ఉన్నతస్థాయికి ఎందరో విద్యార్థులు

సత్యసాయి విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థులు దేశ విదేశాల్లో వివిధ రంగాల్లో ఉన్నత స్థానంలో స్థిరపడ్డారు. ఇక్కడ నేర్చుకున్న క్రమశిక్షణ, విలువలు, గురువులు బోధనలే తమను ఉన్నత స్థానంలో నిలిపినట్లు పలువురు పూర్వ విద్యార్థులు చెబుతున్నారు. ప్రముఖ సినీ నటుడు విజయ దేవరకొండ, ఆయన సోదరుడు సత్యసాయి విద్యాసంస్థల్లో చదువుకున్న వారే.

నాటి గొల్లపల్లియే.. నేటి పుట్టపర్తి





ఒక నాటి గొల్లపల్లి గ్రామమే నేటి పుట్టపర్తి పట్టణం. ఒకప్పుడు గొల్లపల్లిలో గోపాలకులు ఎక్కువగా ఉండటంతో గొల్లపల్లిగా పిలిచేవారు. ప్రచారంలో ఉన్న కథ ప్రకారం గోపాలకులు తమ పాడి ఆవులను మేతకోసం అడవికి తీసుకొని వెళ్లేవారు. ఒక ఆవు మాత్రం ప్రతి రోజు మంద నుంచి తప్పించుకుని అడవిలో మరో చోటుకు వెళ్లేది. అక్కడ ఉన్న పుట్ట వద్ద నిలబడి ఓ పాముకు పాలిచ్చేది. సాయంత్రం ఇంటికి వచ్చాక అది పాలివ్వకపోవడంతో యానిమానికి అనుమానం వచ్చింది. దీంతో ఆయన రహస్యంగా ఆ ఆవు వెంట వెళ్లాడు. యథాప్రకారం ఆ ఆవు ఓ పుట్టవద్దకు వెళ్లి పాముకు పాలివ్వడం ప్రారంభించింది. దీన్ని గమనించిన యజమాని కోపంతో ఆవును కొట్టబోయి పామును కొట్టాడు. దీంతో పాము రక్తసిక్తమయింది. దాని పాపమో, శాపమో గాని అప్పటి నుంచి గోపాలవంశం నశించిపోయింది. పాము చనిపోయిన తర్వాత గొల్లపల్లి గ్రామమంతా పుట్టలు వెలిశాయి. దీంతో ఆ గొల్లపల్లి కాలక్రమేణ పుట్టపర్తిగా మారింది. చిన్న గ్రామంగా ఉన్న పుట్టపర్తి సత్యసాయి బాబా అవతరించడంతో ప్రపంచ ఆధ్యాత్మిక నగరంగా మారింది.

● ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి

నేటి ఎస్‌ఏ-1 పరీక్షలు వాయిదా: డీఈఓ



అనంతపురం విద్య, నవంబరు13(ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవం నేపథ్యంలో శుక్రవారం నిర్వహించాల్సి ఎస్‌ఏ-1 సైన్స్ పరీక్షలు వాయిదా వేసినట్లు డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు. తన కార్యాలయంలో పరీక్షకు సంబంధించిన వివరాలను డీఈఓ వెల్లడించారు. శుక్రవారం 3,4,5 తరగతులకు ఈవీఎస్, 6నుంచి పదో తరగతి వరకు నిర్వహించాల్సిన జనరల్ సైన్స్, ఫిజికల్ సైన్స్ పరీక్షలను వాయిదా వేసినట్లు తెలిపారు. వాయిదా పడిన పరీక్షలు 3,4,5 తరగతులకు ఈనెల 17న, 6నుంచి పదో తరగతి వరకు ఈనెల 20న నిర్వహించాలన్నారు. అంతవరకు ప్రశ్నాపత్రాలను భద్రంగా ఉంచుకోవాలన్నారు. వీటిపై ఎంఈఓలు, హెచ్‌ఎంలదే బాధ్యత అన్నారు.

22న క్లస్టర్ సమావేశాలు

క్లసర్ సమావేశాలు ఈనెల 22న నిర్వహించనున్నట్లు డీఈఓ తెలిపారు. గతంలో ఎస్‌జీటీలు, స్కూల్ అసిస్టెంట్స్ ఆయా క్లస్టర్ స్కూల్‌లో సమావేశాలకు హాజరయ్యేవారన్నారు. అయితే ఇపుడు ఎస్‌జీ టీచర్లు మాత్రమే క్లస్టర్ స్కూళ్లలో మీటింగ్‌లకు హాజరుకావాల్సి ఉంటుంది. అన్ని స్కూల్ అసిస్టెంట్ కేడర్లకు మండల కేంద్రంలోనే క్లస్టర్ సమావేశాలు ఉంటాయన్నారు. ఎస్‌ఏలు, పీడీలందరూ ఆ మండల కేంద్రంలోనే హాజరుకావాల్సి ఉంటుందన్నారు.


పది విద్యార్థులకు వంద రోజుల ప్రణాళిక

ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థుల వంద శాతం ఉత్తీర్ణత కోసం డిసెంబరు 6 నుంచి వందరోజుల ప్రణాళిక ప్రారంభిస్తామని డీఈఓ తెలిపారు. ఆమేరకు ఉపాధ్యాయులు పదో తరగతి పాఠ్యాంశాలను డిసెంబరు 5కే పూర్తిచేసేలా ఎంఈఓలు, హెచ్‌ఎంలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులందరికీ యుడైస్‌లో డేటా ఎంట్రీ పూర్తిచేయాలన్నారు. విద్యార్థుల ఫొటోలు, గుర్తింపు చిహ్నాలు (పుట్టుమచ్చలు) తల్లిదండ్రుల పేర్లు, ఆధార్ నెంబర్లు అన్ని వివరాలు యుడైస్‌లో తప్పులు లేకుండా ఉండేలా చూసుకోవాలన్నారు. యుడైస్‌లో ఏ వివరాలు ఉంటాయో పదో తరగతి మార్కుల మెమోలో అలాగే వస్తాయని అందుకే ఒకటికి రెండుసార్లు పరిశీలించుకొని తప్పులు లేకుండా నమోదు చేయాలని డీఈఓ కోరారు.

చిన్న సారు పెత్తనం..!

పన్నుల శాఖలో చోద్యం

- అసోసియేషన్ ముసుగులో చిరుద్యోగి హవా
- తాడిపత్రి సర్కిల్‌లో స్క్రాప్, గ్రానైట్, లారీ తనిఖీలతో మామూళ్లు
- ఉన్నతాధికారికీ ముడుపులు?
- జూనియర్ అసిస్టెంట్, అటెండర్‌లే వసూల్ రాజాలు



అనంతపురం కలెక్టరేట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అక్కడ ఓ చిన్న సారుదే పెత్తనం. పన్నుల శాఖలోని అసోసియేషన్‌లో కీలకపాత్ర పోషిస్తున్న ఆయన అన్నీ తానై వ్యవహరిస్తుంటారు. ఏ సర్కిల్‌లో పనిచేస్తే అక్కడ ఉన్నతాధికారిని డమ్మీ చేసేస్తారన్న చర్చలు వినిపిస్తున్నాయి. జిల్లాలో కీలక స్థానాల్లో ఉన్న అధికారులకు సైతం ఈయనంటే హడల్. ప్రస్తుతం తాడిపత్రి సర్కిల్‌లో పనిచేస్తున్న ఈయన అక్కడా తనదైన శైలిలో చక్రం తిప్పుతున్నారు. ఉన్నతాధికారికి ముడుపులు సైతం ఈయన నుంచే వెళ్లాల్సిందేనంటే పరిస్థితి ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ సర్కిల్‌లో ఎక్కువగా జీరో బిజినెస్ జరుగుతోంది. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ జేబులు నింపుకుంటున్నారు. అక్కడ జరిగే వ్యవహారం ఉన్నతాధికారులకు తెలిసినా అసోసియేషన్‌లో ఆయనకున్న పవర్‌ను చూసి మిన్నకుండిపోతున్నారు.

స్క్రాప్, గ్రానైట్ గుండ్లతో...

తాడిపత్రి సర్కిల్‌లో స్క్రాప్ బిజినెస్ పెద్ద మొత్తంలో జరుగుతోంది. ఐరన్ ఫ్యాక్టరీలు ఉండటంతో ఇనుప తుక్కు భారీగానే ఇతర ప్రాంతాలకు తరలిస్తుంటారు. టన్నుల కొద్దీ పెద్ద వాహనాల్లో రవాణా చేస్తారు. వాస్తవానికి ఈ స్క్రాప్ నుంచి పన్నుల శాఖకు 18 శాతం జీఎస్టీ చెల్లించాలి. దానిని ఎగ్గొట్టి.. అంతా జీరో బిజినెస్ జరుగుతుంటుంది. ఒక వే బిల్లుపై నాలుగైదు వాహనాలు తరలించడం లాంటివి చేస్తున్నారు. ఈ విషయంలో ఆ చిన్న సారుకు ముడుపులు వెళ్తుంటాయనే ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో ప్రతినెలా రూ.10 లక్షలకుపైగా జీఎస్టీ ఎగవేస్తున్నట్లు సమాచారం. ఇక తాడిపత్రిలో 60 వరకు గ్రానైట్ గుండ్ల క్రషింగ్ (పాలిష్) ఫ్యాక్టరీలున్నాయి. ప్రకాశం జిల్లా కనిగిరితోపాటు కర్ణాటక, ఉమ్మడి జిల్లాలోని కొన్ని ప్రాంతాల నుంచి గ్రానైట్ గుండ్లను తరలిస్తుంటారు. వీటిలో భారీగా జీరో బిజినెస్ జరుగుతోంది. ఒక్కో గ్రానైట్ గుండుపై రూ.30వేలు జీఎస్టీ చెల్లించాలి. ఆ పన్ను ఎగ్గొడుతున్నారు. ఇక్కడ కూడా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ అధికారులు ముడుపులు పుచ్చుకుంటున్నారు.

లారీ చెకింగ్‌లతో...

తాడిపత్రి సర్కిల్ పరిధిలో భారీ వాహనాల్లో వివిధ ప్రాంతాలకు అనేక వస్తువులు రవాణా అవుతుంటాయి. పన్నుల శాఖలో లారీ చెక్ పేరుతో అధికారులు, సిబ్బంది తనిఖీలు చేస్తుంటారు. ఇక్కడ లారీ చెక్‌లతో అధికారులు ఆమ్యామ్యాలు పుచ్చుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఇదివరకు అక్కడ పనిచేస్తున్న అధికారులు లారీ చెక్‌లలో జరిమానాలు వేసి ఆ శాఖకు ఆదాయం చూపారు. ఒకరిద్దరు డీసీటీఓలు ఒక్కో వాహనానికి రూ.5 లక్షల నుంచి అత్యధికంగా రూ.14 లక్షల వరకు జీఎస్టీ, జరిమానా విధించిన దాఖలాలున్నాయి. కొంతకాలంగా ఆ స్థాయిలో తనిఖీలు చేయడం లేదనీ, చేసినా ఆదాయం చూపడం లేదని ఆ శాఖ వర్గాలే పేర్కొంటున్నాయి.

వారే.. వసూల్ రాజాలు

తాడిపత్రి సర్కిల్‌లో ఏం జరిగినా ఆ చిన్న సారుకు తెలియాల్సిందే. అటెండర్‌కు సీనియర్ అసిస్టెంట్‌కు మధ్య కేడర్‌లో ఉండే ఆ చిరుద్యోగి అసోసియేషన్ ముసుగులో వ్యవహారాలు వెలగబెడుతున్నారు. తనకు అనుకూలంగా ఉన్న జూనియర్ అసిస్టెంట్, ఓ అటెండర్ సాయంతో వసూళ్లకు తెరలేపుతుంటారు. వాహనాలు తనిఖీ చేయాలంటే కనీసం డీసీటీఓ స్థాయి అధికారి ఉండాలి. ఇక్కడ ఆ నిబంధనలేమీ పనిచేయవు. జూనియర్ అసిస్టెంట్, అటెండర్‌లే దర్జాగా లారీ చెక్‌లలో పాల్గొంటారు. మరోలా చెప్పాలంటే వీరు ఇక్కడ వసూల్ రాజాల అవతారం ఎత్తారు. ప్రతినెలా వచ్చే ఆమ్యామ్యాలు, డీలర్ల నుంచి పుచ్చుకునే ముడుపులు, వాహన తనిఖీల్లో అందే సొమ్ము ఇలా అంతా ఆ చిన్న సారుకు వెళ్తాయి. ఏమీ మాట్లాడకుండా ఉండటానికి ఉన్నతాధికారికి కూడా ఈ సారు నుంచే కొంత భాగం వెళ్తుందని తెలుస్తోంది. దీంతో ఆ ఉన్నతాధికారి కిమ్మనకుండా ఉంటున్నారనే విమర్శలున్నాయి. ఇలా.. నెలనెలా పన్నుల శాఖ ఆదాయానికి భారీగానే గండి కొడుతున్నారు.

మా ప్రాణం మీరే..

- కార్యకర్తలను ఉద్దేశించి ఎమ్మెల్యే సునీత
- అట్టహాసంగా నియోజకవర్గ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): 'మా ప్రాణం మీరే.. మీరే మమ్మల్ని ముందుండి నడిపించారు. ఊపిరి ఉన్నంతవరకు మీ కోసమే పనిచేస్తా'మని టీడీపీ కార్యకర్తలను ఉద్దేశించి ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. మండలంలోని కక్కలపల్లి క్రాస్‌లో గల ఆర్ కన్వెన్షన్ హాల్‌లో గురువారం టీడీపీ నియోజకవర్గ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం అట్టహాసంగా సాగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు అంజినప్ప హాజరయ్యారు. ముందుగా పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్, మాజీ మంత్రి పరిటాల రవీంద్ర చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఎంపికైన 1350మంది బూత్, గ్రామ, యూనిట్, క్లస్టర్, మండల కమిటీల సభ్యులతో ఉమ్మడిగా ప్రమాణ స్వీకారం చేయించారు. శాలువాలు, పూలతో సన్మానం చేశారు. ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడిన నాయకులకు తగిన గుర్తింపు నిచ్చే బాధ్యత తమదన్నారు. ఇప్పటికే చాలామందికి పదవులు దక్కాయన్నారు. వారంతా బాధ్యతగా పనిచేయాలన్నారు. ఇంకా కొన్ని పెండింగ్‌లో ఉన్నాయనీ, వాటిని త్వరలోనే ఎంపిక చేస్తామన్నారు. గత ఐదేళ్లలో నియోజవకర్గంలో ఎలాంటి అభివృద్ధి చేయని ప్రకాష్‌రెడ్డి ఇష్టం వచ్చినట్లు.. తమపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. దీనిని తిప్పి కొట్టాల్సిన బాధ్యత నాయకుడిపై ఉందన్నారు. ఒక మహిళ చేతిలో మూడుసార్లు ఓడిపోయిన అసమర్థుడు ప్రకాష్ రెడ్డి అన్నారు. ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి.. అభివృద్ధి గురించే పట్టించుకోకపోవడంతే ప్రజలు దారుణంగా ఓడించారన్నారు. కూటమి చేస్తున్న అభివృద్ధిని చూసి నియోజకవర్గంలో తనకు మనుగడ ఉండదన్న ఉద్దేశంతోనే ప్రకాష్‌రెడ్డి.. పరిటాల కుటుంబం గురించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. పరిటాల రవీంద్ర పేరును తగ్గించే పనులు తమ కుటుంబం ఎప్పుడూ చేయదన్నారు. అలా చేస్తే.. కాలర్ పట్టుకుని నిలదీయాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



మండల క్లస్టర్, యూనిట్, గ్రామ బూత్ కమిటీ సభ్యులను సన్మాస్తున్న ఎమ్మెల్యే తదితరులు

ఆదరణ 3.0 లోడింగ్..!

బడుగులకు తీపికబురు

- కులవృత్తుల వారి సంక్షేమానికి సీఎం నిర్ణయం
- లబ్ధిదారులకే పనిముట్లను ఎంచుకునే స్వేచ్ఛ
- 10శాతం చెల్లిస్తే చాలు మిగిలిన భారం ప్రభుత్వానిదే..
- డిసెంబరు నుంచే ప్రక్రియ?



బీసీ కార్పొరేషన్ కార్యాలయం

అనంతపురం విద్య, నవంబరు13(ఆంధ్రజ్యోతి): బడుగులకు తీపికబురు. టీడీపీ హయాంలో అమలు చేసిన ఆదరణ పథకం మళ్లీ పట్టాలెక్కనుంది. కులవృత్తిదారులకు పనిముట్లను ప్రభుత్వం పంపిణీ చేయనుంది. ఆ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. టీడీపీ హయాంలో ఆదరణ పథకం కింద గొర్రెల కాపర్లు, కల్లుగీత కార్మికులు, కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, భవన నిర్మాణ కార్మికులు, వడ్డెర, నాయీబ్రాహ్మణులు, రజకులు, చేనేత కార్మికులు, టైలరింగ్, పాలవ్యాపారం, ఎలక్ట్రీషియన్ ఇలా కులవృత్తిదారులకు పనిముట్లను ప్రభుత్వమే అందించింది. వైసీపీ అధికారం చేపట్టాక ఆదరణ పథకాన్ని అటకెక్కించింది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి మళ్లీ బీసీ కులవృత్తిదారులను ఆదుకోవడానికి ఆదరణ 3.0 అమలు చేయనుంది. ఇందుకు సీఎం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతోపాటు ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించారు. దీంతో ఆదరణ 3.0 పథకం అమలుకు యంత్రాంగం అడుగులు వేస్తోంది. వచ్చే ఏడాది ప్రారంభం నుంచే లబ్ధిదారులకు పనిముట్లు అందజేయనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

లబ్ధిదారులే ఎంపిక చేసుకోవచ్చు..

ఆదరణ 3.0 పథకాన్ని ఈసారి పక్కాగా అమలు చేసేందుకు సీఎం చంద్రబాబు ప్రణాళికలు రూపొందించినట్లు చెబుతున్నారు. గతంలో ఈ పథకం ద్వారా ప్రభుత్వమే వృత్తిదారులకు ఏది కావాలో నిర్ణయించి పనిముట్లు సరఫరా చేసింది. పరికరాల విలువలో 10 శాతం లబ్ధిదారుడు చెల్లిస్తే మిగిలిన 90శాతం ప్రభుత్వమే భరించింది. అపుడు ఒకేసారి మాత్రమే లబ్ధిదారులకు అవకాశం కల్పించింది. ఈసారి అలా కాకుండా లబ్ధిదారుడికే పరికరాలను ఎంపిక చేసుకునే అవకాశం కల్పించనున్నట్లు యంత్రాంగం చెబుతోంది. తర్వాత వాటిని ప్రభుత్వం కొనుగోలు చేసి లబ్ధిదారులకు పంపిణీ చేయనుంది. ఏటా దరఖాస్తులు స్వీకరించి, అర్హులకు పనిముట్లు అందించనున్నారు. ఆదరణ 3.0 పథకంలో కూడా 10 శాతం లబ్ధిదారులు చెల్లిస్తే.. 90శాతం ప్రభుత్వమే సబ్సిడీ కింద భరించనుంది.

మార్గదర్శకాలు రావాల్సి ఉంది..



బీసీ(కులవృత్తదారు)లకు ఆదరణ 3.0 కింద పనిముట్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే సీఎం.. రాష్ట్రస్థాయి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. జిల్లాకు ఆ మేరకు సంకేతాలు వచ్చాయి. మార్గదర్శకాలు రావాల్సి ఉంది.

● రామసుబ్బారెడ్డి, బీసీ కార్పొరేషన్ ఈడీ



నిరసన తెలుపుతున్నచేతివృత్తికార్మికులు

ఆదరణ వెంటనే అమలు చేయాలి

ఆదరణ పథకాన్ని వెంటనే అమలు చేయాలని చేతివృత్తిదారులు నిరసన చేపట్టారు. గురువారం చేతివృత్తిదారుల సమాఖ్య ఆధ్వర్యంలో అనంతపురంలోని బీసీ కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఆ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు లింగమయ్య మాట్లాడుతూ.. చేతివృత్తిదారులకు రుణాలు అందించి ఆదుకుంటామని కూటమి సర్కారు హామీ ఇచ్చినా.. ఇంతవరకు అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. జిల్లాలో 30 రకాల కులవృత్తిదారులు ఉన్నారనీ, వీరందరూ ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ రుణాలకోసం ఎదురు చూస్తున్నారన్నారు. వెంటనే సీఎం స్పందించి రుణాలు మంజూరుచేసి పరికరాలు అందించి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం బీసీ కార్పొరేషన్ ఈడీ రామసుబ్బారెడ్డికి వినతిపత్రం అందజేశారు. నిరసనలో చేతివృత్తిదారుల సమాఖ్య నాయకులు నాగప్ప, టీసీ భూషణ, రాజు, రాము, గోవిందరాజులు, రఘు,సుంకన్న, పాపన్న, ఈశ్వరమ్మ, వీరాంజి, చిన్న నారాయణస్వామి, ఆదినారాయణ, మారుతి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఘరానా దొంగ అరెస్ట్?

- కళ్యాణదుర్గంలో అదుపులోకి తీసుకున్న కర్ణాటక పోలీసులు
- నిందితుడిపై వందకుపైగా చోరీ కేసులు

కళ్యాణదుర్గం రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): వివిధ రాష్ట్రాల్లో చోరీలకు పాల్పడుతున్న కళ్యాణదుర్గానికి చెందిన ఓ వ్యక్తిని కర్ణాటక పోలీసులు బుధవారం అరెస్టు రాత్రి అరెస్టు చేశారు. ఇతడిపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో వందకుపైగా చోరీ కేసులు ఉన్నట్లు సమాచారం. ఇతను వివిధ చోరీ కేసుల్లో అరెస్టు అయ్యి ఈ ఏడాది సెప్టెంబరు 13న విడుదలయ్యాడు. రెండు రోజులు కూడా గడవక ముందే సెప్టెంబరు 17న కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లా మొలకాల్మూరు తాలుకా రాంపురం పట్టణంలో 16 తులాల బంగారం చోరీ చేశాడు. పరారీలో ఉన్న అతడిపై కర్ణాటకలో కేసు నమోదైంది. ఘటనాస్థలంలో దొరికిన సీసీ ఫుటేజీ ఆధారంగా కర్ణాటక పోలీసులు నిందితుడు కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఈ నేపథ్యంలోనే కర్ణాటక పోలీసులు సీఐ మంజునాథ్, ఎస్ఐ బాహుబలి ఆధ్వర్యంలో మూడు వాహనాల్లో పట్టణానికి వచ్చారు. పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చి నిందితుడిని అరెస్టు చేసినట్లు సమాచారం. దొంగతనాలకు పాల్పడిన వ్యక్తి చోరీ సొత్తును పట్టణంలోని ముగ్గురు మహిళలకు ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు ఆ మహిళల నుంచి పది తులాల బంగారం రికవరీ చేసినట్లు సమాచారం. ఈ ముగ్గురు మహిళల్లో ఒకరిపై రౌడీషీట్ కూడా ఉన్నట్లు తెలిసింది. ఈ ముగ్గురు మహిళలపై కళ్యాణదుర్గం, కర్ణాటక పోలీస్‌స్టేషన్‌లో అక్రమ మద్యం, మట్కా, తదితర అనేక కేసులు ఉన్నట్లు సమాచారం. వీరి వెనుక మరికొంతమంది హస్తం ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


ప్రమాదంలో దెబ్బతిన్న ద్విచక్రవాహనం

కూడేరు, నవంబరు13(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామచంద్రాపురం గ్రామ సమీపాన గురువారం రోడ్డు ప్రమాదంలో కృష్ణానాయక్ (32) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనంతపురం రూరల్ మండలం కురుగుంట వైఎస్ఆర్ కాలనీకి చెందిన కృష్ణానాయక్ రెస్టారెంట్‌లో పనిచేస్తుండేవాడు. అనంతపురం నుంచి కూడేరు వైపు ద్విచక్రవాహనంలో వస్తుండగా.. రామచంద్రాపురం వద్ద ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కృష్ణానాయక్‌ను అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. ఇతడికి భార్య రుక్మిణీబాయి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రుక్మిణీబాయి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కళ్లలో కారం కొట్టి దోపిడీ యత్నం

- కాపాడిన కళ్లద్దాలు


వివరాలు వెల్లడిస్తున్న సెల్‌ఫోన్ షాపు యజమాని సురేష్

సోమందేపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ షాపు యజమాని కళ్లలో కారం కొట్టి దారి దోపిడీ చేసేందుకు యత్నించారు. కళ్లద్దాల కారణంగా అతడు తప్పించుకున్నాడు. హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గుడిపల్లికి చెందిన సురేష్ సోమందేపల్లిలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో మొబైల్ షాపు నిర్వహిస్తున్నారు. బుధవారం రాత్రి షాపును బంద్ చేసి స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో బయల్దేరాడు. రూ.1.50లక్షలు నగదు, రూ.లక్ష విలువచేసే సెల్‌ఫోన్ల బ్యాగుతో బయల్దేరాడు. జాతీయ రహదారిపై పాపిరెడ్డిపల్లి సమీపాన యూటర్న్ వద్ద వాహనాలు వస్తుండటంతో ఆగాడు. ఇంతలో ఎదురుగా బైక్‌లో వచ్చిన ముగ్గురు దుండగులు అడ్డుగా నిలిపారు. కళ్లలో కారం కొట్టారు. కళ్లద్దాల కారణంగా అతడి కళ్లలోకి కారం పడలేదు. కిందపడిన సురేష్‌పై దుండగులు దాడికి యత్నించారు. వారి బారి నుంచి తప్పించుకుని పాపిరెడ్డిపల్లి వైపు పొలాల్లోకి పరుగులు తీశాడు. అదే సమయంలో పాలవ్యాన్ అటుగా రావడంతో దుండగులు తుంగోడు వైపు పరారయ్యారు. వెంటనే సురేష్.. గ్రామస్థులకు సమాచారం అందించాడు. అనంతరం సోమందేపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారిస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిపై కేసు

తాడిపత్రి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిపై గురువారం కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ఆరోహణ రావు తెలిపారు. రెండురోజుల క్రితం పోలీసుల సమక్షంలోనే పెద్దారెడ్డి ఫ్యాక్షన్ చేస్తానంటూ ప్రజలను భయభ్రాంతులు చేసేలా మాట్లాడారని, దీనిపై 30వ వార్డు కౌన్సిలర్ మల్లికార్జున ఫిర్యాదు చేశారని, దీంతో పెద్దారెడ్డిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

టమోటా కిలో రూ.40

అనంతపురం రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో గురువారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.40తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.20తో, సరసరిగా రూ.30తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 2025 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి):అనంత వ్యవసాయ మార్కెట్లో గురువారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరి ధర రూ.15వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 26టన్నుల చీనీకాయలు వచ్చినట్లు చెప్పారు.

సివిల్స్‌కు ఉచిత శిక్షణ

అనంతపురం విద్య, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ కులాల నిరుద్యోగ అభ్యర్థులకు సివిల్ సర్వీసెస్(ప్రిలిమ్స్)కు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్సీ సంక్షేమ శాఖ ఇన్‌చార్జి డీడీ కుష్బూకొఠారి గురువారం ప్రకటనలో తెలిపారు. విజయవాడ, విశాఖపట్నం తిరుపతిలో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. డిసెంబరు 10నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 10వ తేదీ వరకు ఈశిక్షణ కొనసాగుతుందన్నారు. ఉచిత భోజనం, వసతి, కల్పిస్తారన్నారు. మొత్తం 340మంది అభ్యర్థులకు అవకాశం ఉంటుందనీ, ఇందులో మహిళలకు 33శాతం ఉంటుందన్నారు. ఆసక్తిగలవారు ఈనెల 20వతేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీడీ సూచించారు.

మహిళలకు..

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రూడ్‌సెట్‌లో ఈనెల 22 నుంచి మహిళలకు కుట్టు మిషన్, టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. 18-45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి రేషన్, ఆధార్‌కార్డు కలిగిన ఉమ్మడి జిల్లా నిరుద్యోగ మహిళలు అర్హులన్నారు. 30రోజుల పాటు సాగే శిక్షణా కాలంలో భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. వివరాలకు ఎస్కేయూ సమీపంలోని రూడ్‌సెట్ కార్యాలయంలో నేరుగా లేదా సెల్ నంబరు 9492583434ను సంప్రదించాలని కోరారు.

లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించండి

- ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రచార కార్యదర్శి రామిరెడ్డి

అనంతపురం టౌన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు పీఎఫ్, ఎస్ఆర్‌బీఎస్ పింఛన్లు పొందేందుకు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలని ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి రామిరెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. పీఎఫ్ కోసం డిజిటల్, ఎస్ఆర్‌బీఎస్ పింఛన్ కోసం మాన్యువల్ లైఫ్ సర్టిఫికెట్లను నెలాఖరులోపు సంబంధిత కార్యాలయాలకు చేర్చాలన్నారు. విశ్రాంత ఉద్యోగులు అనంతపురం డిపో వద్ద దరఖాస్తు ఫాంలను ఉచితంగా పొందవచ్చన్నారు. దరఖాస్తుకు ఆధార్ నకలు జతచేసి, పంపాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 9985431084 నంబరులో సంప్రదించాలన్నారు.

బడి పిల్లలకే.. ఉపకార వేతనం..!

- చక్కటి అవకాశం.. ఎన్ఎంఎంఎస్
- ఎనిమిదో తరగతి వారికి 7న పరీక్ష
- ఎంపికైన వారికి నాలుగేళ్లపాటు ప్రయోజనం

ధర్మవరం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): చదువులో ప్రతిభ ఉన్నా ఆర్థిక పరిస్థితులు బాగోలేక కొందరు ఉన్నత చదువులకు దూరమవుతున్నారు. ఇలాంటి వారికి కేంద్ర ప్రభుత్వం ఆర్థిక చేయూతనందిస్తోంది. ప్రభుత్వం నిర్వహించే పరీక్షల్లో అర్హత సాధిస్తే నాలుగేళ్లపాటు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) బ్యాంకు ఖాతాలో జమ చేస్తుంది. ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు ఈ ఆర్థిక ప్రయోజనం ఎంతగానో ఉపయోగపడుతోంది. నెలరోజులు కష్టపడితే నాలుగేళ్లపాటు స్కాలర్‌షిప్ అందుతుంది. ఆయా పాఠశాలల్లో 8వ తరగతి చదివే విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించి ఎన్ఎంఎంఎస్ సాధించేలా తీర్చిదిద్దుతున్నారు. 2025-26 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదివే వారికి ఉపకార వేతనం అందించేందుకు ఏటా పరీక్ష నిర్వహిస్తోంది. జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెడ్, ఆదర్శ పాఠశాలల్లో చదువుతూ కుటుంబ ఆదాయం రూ.3.5 లక్షలలోపు ఉన్న విద్యార్థులు అర్హులని విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

జిల్లాలో 8వ తరగతి విద్యార్థుల వివరాలు ఇలా..

జిల్లావ్యాప్తంగా 8వ తరగతి చదివే విద్యార్థులు 24,184 మంది ఉన్నట్లు విద్యాశాఖ గణాంకాల ద్వారా తెలుస్తోంది. గతేడాది జిల్లా వ్యాప్తంగా ఈ పరీక్షలను 2,010 మంది విద్యార్థులు రాయగా.. 155 మంది ఎంపికయ్యారు. ఈ ఏడాది ఎన్ఎంఎంఎస్‌కు 2,697 దరఖాస్తులు రాగా.. 6 తిరస్కరించారు. మిగిలిన 2,661 మంది విద్యార్థులకు డిసెంబరు 7వ తేదీన పరీక్ష ఉంటుందని విద్యాశాఖ అధికారులు తెలిపారు. మెరిట్ ఆధారంగా ఎంపిక ఉంటుంది. 24రోజుల సమయం ఉంది. గత పరీక్షల్లో విజయం సాధించిన వారి అనుభవాలను పరిగణనలోకి తీసుకుని కష్టపడి చదివితే నాలుగేళ్లపాటు ఉపకార వేతనం అందుతుంది.


ఎన్ఎంఎంఎస్‌పై అవగాహన కల్పిస్తున్న టీచర్

పేద విద్యార్థులకు చేయూత

- లాజర్, విద్యాశాఖ ఏడీ, శ్రీసత్యసాయి జిల్లా

చిన్నపాటి శిక్షణతో ఉపకార వేతనాలకు ఎంపిక కావచ్చు. విద్యార్థులను సన్నద్ధం చేయడంపై ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలి. పరీక్షల్లో ప్రతిభ చూపితే నాలుగేళ్లపాటు ఆర్థిక చేయూత లభిస్తుంది. ఎన్ఎంఎంఎస్‌కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు పరీక్ష బాగారాసి ప్రతిభ కనబరచాలి.

ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికయ్యా



ధర్మవరం శాంతినగర్‌లోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో చదువుతున్నా. 8వ తరగతి చదువుతున్న సమయంలో పాఠశాలలో ఎన్ఎంఎంఎస్ శిక్షణ పొందడంతోపాటు ఉదయం, సాయంత్రం గణితంపై సాధన చేశా. సందేహాలను ఉపాధ్యాయులతో నివృత్తి చేసుకున్నా. ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికయ్యా. ప్రతినెలా రూ.1000 స్కాలర్‌షిప్ అందుతోంది.

-చైతన్య, పదో తరగతి విద్యార్థి

ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం



మా పాఠశాల నుంచి ఎన్ఎంఎంఎస్‌కు 20 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి రోజూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. నమూనా ప్రశ్నపత్రాలతో పరీక్షకు సిద్ధం చేస్తున్నాం. మంచి ఫలితాలే లక్ష్యంగా కృషి చేస్తున్నాం.

-ఉమాపతి, హెచ్ఎం, శాంతినగర్ మున్సిపల్ పాఠశాల

ఎస్కేయూ రిటైర్డ్ వీసీ ప్రొఫెసర్ శుభ మృతి


ప్రొఫెసర్ శుభ (ఫైల్)

అనంతపురం రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం మాజీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ శుభ అనారోగ్యంతో గురువారం హైదరాబాదులో మృతి చెందారు. ఆమె వర్సిటీలో రసాయన శాస్త్ర ప్రొఫెసర్‌గా, సీడీసీ డీన్‌గా, రెక్టార్‌గా, ఇన్‌చార్జి ఉపకులపతిగా సేవలు అందించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు సహా అనేక పురస్కారాలను అందుకున్నారు. ఇటీవల 'షీ ఈజ్ ఉమన్ ఇన్ కెమిస్ట్రీ' అనే లండన్‌కు చెందిన పుస్తకంలో ఆమె ఫొటో ప్రచురితమైంది. ప్రపంచ వ్యాప్తంగా 30 మంది అత్యున్నత మహిళా కెమిస్ట్రీ ప్రొఫెసర్లలో ఆమెకు చోటు దక్కింది. ప్రొఫెసర్ శుభ భర్త చౌడాజీ రావు ఎస్కేయూ పాలిమర్ సైన్స్ విభాగంలో ప్రొఫెసర్‌గా సేవలందించి, పదవీ విమరణ చేశారు. శుభ మృతికి జేఎన్‌టీయూఏ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య, ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ అనిత, రెక్టార్ వెంకటనాయుడు, రిజిస్ట్రార్ రమేష్‌బాబు తదితరులు సంతాపం ప్రకటించారు. ఆమె మృతదేహాన్ని అనంతపురం శారదనగర్‌లోని స్వగృహానికి గురువారం రాత్రికి తీసుకువచ్చారు. ఆమె పార్థివదేహానికి పలువురు నివాళులు అర్పించారు.

రేపు జాబ్‌మేళా

పెనుకొండ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జయప్ప, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరిక్రిష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలకు కళాశాలలో నిర్వహించే జాబ్‌మేళాకు పది కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. ఇంటర్వ్యూకు హాజర య్యే విద్యార్థులు తాము చదివిన విద్యకు సంబంధించిన సర్టిఫికెట్లు వెంట తీసుకురావాలన్నారు. 18-35 సంవత్సరాలు కలిగినవారు అర్హులన్నారు.

రాష్ట్ర జట్టుకు ఇద్దరు ఎంపిక


వీరారెడ్డి, జయంత్ కృష్ణ

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా అండర్-19 మల్టీ డే క్రికెట్ జట్టులో జిల్లాకు చెందిన వీరారెడ్డి, జయంత్‌కృష్ణ చోటు దక్కించుకున్నారు. ఈ నెల 16వతేదీ నుంచి దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో నిర్వహించే కూచ్ బెహర్ ట్రోఫీలో ఆంధ్రా జట్టు తరఫున వీరు ప్రాతినిధ్యం వహించనున్నారు. జాతీయ పోటీలకు ఎంపికైన వీరిని పలువురు అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు నార్పల విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నార్పల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ జిల్లా ఎంపికలో నార్పల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు హాకీ, నెట్‌బాల్‌లో మంచి ప్రదర్శన కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపకయ్యారు. అండర్-17 హాకీలో వీ మనోజ్, అండర్-19 నెట్‌బాల్‌లో ఈ చేతన్, అండర్-14 నెట్‌బాల్‌లో మనోజ్‌కుమార్ రెడ్డి పోటీలలో పాల్గొంటారని హెచ్ఎం రవికుమార్ తెలిపారు. విద్యార్థులను పీడీ అంజనేయులు, పీఈటీ సనీమాబేగం, ఉపాధ్యాయులు అభినందించారు.

క్రీడలతో మానసిక ఆహ్లాదం

- ఎస్కేయూ రిజిస్ట్రార్ రమేష్‌బాబు



మాట్లాడుతున్న ఎస్కేయూ రిజిస్ట్రార్ రమేష్ బాబు

కళ్యాణదుర్గంరూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఆహ్లాదాన్ని కలిగిస్తాయని ఎస్కేయూ రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ బాబు అన్నారు. స్థానిక కరణం చిక్కప్ప ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో గురువారం ఎస్కేయూ ఇంటర్ కాలేజియేట్ గ్రూప్ బి పోటీలు ప్రారంభమయ్యాయి. రిజిస్ట్రార్ రమేష్ బాబు జ్యోతిని వెలిగించి, పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో చురుగ్గా ఉన్న పిల్లల్లో నాయకత్వ లక్షణాలతో పాటు ఇతర నైపుణ్యాలు దాగి ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఎస్కేయూ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ జెస్సీ, కళాశాల ప్రిన్సిపాల్ హర్షలత, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ అర్థశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ కోనంకి శ్రీధర్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు వందమంది ఉద్యోగులు


ప్రభుత్వ ఉద్యోగుల క్రికెట్ పోటీల్లో డీఎస్‌డీఓ, శాప్ కోచ్‌లు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ప్రభుత్వ ఉద్యోగుల క్రీడాపోటీలకు జిల్లా నుంచి వంద మంది ఎంపికయ్యారు. ప్రభుత్వ ఉద్యోగుల జిల్లా స్థాయి క్రీడా పోటీలు గురువారం నగర పరిధిలోని వేర్వేరు మైదానాల్లో నిర్వహించారు. 150మందికిపైగా పోటీల్లో పాల్గొనగా.. రాష్ట్రస్థాయి పోటీలకు వందమంది ఎంపికయ్యారని డీఎస్‌డీఓ మంజుల తెలిపారు. వారు ఈనెల 19వ తేదీ నుంచి ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాలకు 08554-315632 నంబరులో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్ఏ సూపరిండెంట్ దేవమణి, శాప్ కోచ్‌లు జెబీవుల్లా, సంధ్య, లక్ష్మి పాల్గొన్నారు.

ఆంధ్రా అండర్-13 జట్టులో దీపక్



అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అండర్-23 క్రికెట్ జట్టులో జిల్లాకు చెందిన దీపక్‌కు చోటు దక్కింది. శుక్రవారం నుంచి బరోడాలో నిర్వహించే బీసీసీఐ అండర్-13 జాతీయ వన్డే టోర్నీలో ఆంధ్రా జట్టు తరఫున దీపక్ ప్రాతినిధ్యం వహించనున్నాడు. దీపక్‌ను పలువురు అభినందించారు.

ఆర్చరీ జిల్లా జట్ల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆర్చరీ జిల్లా క్రీడాకారులను ఎంపిక చేశారు. ఆర్డీటీ స్టేడియంలో గురువారం ఉమ్మడి జిల్లాస్థాయి ఆర్చరీ జూనియర్స్, సీనియర్స్ బాల, బాలికల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారుల వివరాలను జిల్లా ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి శివకుమార్ వెల్లడించారు.

జూనియర్ బాలుర కేటగిరిలో అల్లీషర్ మహ్మద్, అభినవ్, సలేహా, దాదాసల్మాన్, యోగేశ్వర్‌రెడ్డి, సాయి ఈశ్వర్, ఎస్‌జే బాషా, ప్రజ్వల్ ఎంపికయ్యారు.

బాలికల విభాగంలో శ్రీలేఖ, గుణశ్రీ, అనీమా ప్రియదర్శిని, వందన, జాహ్నవి, మాన్వితలు ఎంపికయ్యారు.

సీనియర్ బాలుర విభాగంలో మహమూద్, పవన్, అనీల్, ప్రకాష్, హరీష్‌రెడ్డి, సలేహా, దాదా సల్మాన్, భోగేశ్వర్‌రెడ్డి, ప్రజ్వల్, ఎస్‌జే బాషా, రాఘవేంద్ర, ఇసాక వుల్లా, వెంకటరమణ ఎంపికయ్యారు.

బాలికల్లో శ్రీరమ్య, శ్రీలేఖ, గుణశ్రీ, ప్రియదర్శిని అర్హత సాధించారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 16 నుంచి నూజివీడులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీకృష్ణ, పీఈటీ హరీష్, కోచ్‌లు నలిని, లక్ష్మిదేవి, రాహుల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


ఎంపికైన జిల్లా ఆర్చరీ జట్టు

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే

- వృద్ధ దంపతులను రోడ్డు దాటించిన ఎంఎస్ రాజు


వృద్ధులను రోడ్డు దాటిస్తున్న ఎమ్మెల్యే

మడకశిర టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నడవడానికి ఇబ్బంది పడుతున్న వృద్ధ దంపతులను రోడ్డు దాటంచి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మానవత్వం చాటుకున్నారు. మండలంలోని హారేసముద్రం గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు గురువారం బ్యాంకు పని నిమిత్తం పట్టణానికి వచ్చారు. స్టేట్ బ్యాంకు సమీపాన రోడ్డు దాటడానికి ఇబ్బంది పడుతుండేవారు. అదే సమయంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు.. గుడిబండ మండలానికి వెళ్తూ అటుగా వచ్చారు. వృద్ధ దంపతుల పరిస్థితిని చూసి.. వెంటనే వాహనాన్ని ఆపారు. ఆయన కిందికి దిగి వృద్ధ దంపతుల వద్దకెళ్లి వారి పరిస్థితిని అడిగి తెలుసుకొన్నారు. రోడ్డు దాటించి మానవత్వం చాటుకున్నారు. స్టేట్‌బ్యాంకు వద్దకు తోడుగా పంపించారు. వృద్ధుల పని పూర్తి చేయించి, ఆటోలో స్వగ్రామానికి పంపించాలని సిబ్బందికి సూచించారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి

- అహుడా చైర్మన్ టీసీ వరుణ్



అర్జీలు స్వీకరిస్తున్న అహుడా చైర్మన్, జేసీ

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): అనంతపురం-హిందూపురం పట్టణాభివృద్ధి సంస్థ (అహుడా) పరిధిలో ప్రజలు విన్నవించిన సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని చైర్మన్ టీసీ వరుణ్.. అధికారులను ఆదేశించారు. స్థానిక అహుడా కార్యాలయంలో గురువారం నిర్వహించిన స్పెషల్ గ్రీవెన్స్‌లో జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మతో కలిసి ఆయన అర్జీలను స్వీకరించారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడిన చైర్మన్ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన సమీక్షలో పలు అంశాలపై చర్చించారు. ఎంఐజీ లేఅవుట్లలో మౌలిక వసతుల కల్పన పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతపురం నగరంలో పింక్ టాయిలెట్ల నిర్మాణం, స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు తదితర పనులను త్వరితగతిన ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో అహుడా కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ప్లానింగ్ ఆఫీసర్ ఇషాక్, జేపీఓ హరీష్‌చౌదరి, ఈఈ దుష్యంత్, డీఈ రేవంత్, పబ్లిక్ హెల్త్ డీఈ జ్యోతి పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేయండి

- నూతన ఎంపీడీఓలకు జడ్పీ చైర్‌పర్సన్ సూచన


ఎంపీడీఓలుగా నియామక పత్రాలు అందజేస్తున్న గిరిజమ్మ

అనంతపురం న్యూటౌన్, నవంబరు13(ఆంధ్రజ్యోతి) బాధ్యతతో విధులు నిర్వర్తించి మంచి గుర్తింపును పొందాలని ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి పొందిన వారికి జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ సూచించారు. ఏఓల నుంచి ఐదుగురు, డిప్యూటీ ఎంపీడీఓల నుంచి మరో ఐదుగురు ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి పొందారు. దీంతో ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న ఎంపీడీఓ స్థానాల్లో వారికి గురువారం పోస్టింగ్స్ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక జడ్పీ కార్యాలయంలో చైర్‌పర్సన్ గిరిజమ్మ చాంబర్‌లో చేపట్టారు. వెంకటాచలపతిని కనగానపల్లికి, గంగాధర్ అగళి, రత్నాబాయి పెద్దపప్పూరు, రామ్‌కుమార్ తనకల్లు, రామకృష్ణ గాండ్లపెంట, హరికృష్ణ బాలాజీ చిలమత్తూరు, దేవదాసు గుంతకల్లు, రాధాకృష్ణ విడపనకల్లు, దామోదరమ్మ హిందూపురం, అశోక్‌కుమార్‌రెడ్డిని నల్లచెరువు ఎంపీడీఓలుగా నియమిస్తూ చైర్‌పర్సన్ ప్రొసీడింగ్స్ అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శివశంకర్, జిల్లా పరిషత్ కార్యాలయంలోని సంబంధిత పరిపాలన విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రా అండర్-19 క్రికెట్ జట్టుకు మాన్విత



మాన్వితను అభినందిస్తున్న హెచ్ఎం సిస్టర్ అమలామేరీ

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ రాష్ట్ర అండర్-19 క్రికెట్ జట్టుకు అనంత అమ్మాయి మాన్విత ఎంపికైంది. ఇటీవల శ్రీకాకుళంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీలో ప్రతిభ కనబరచిన మాన్విత జాతీయ పోటీలకు అర్హత సాధించింది. అనంతపురం స్పోర్ట్స్ అకాడమీలో మాన్విత సాధన చేస్తోంది. నెలాఖరులో జరిగే జాతీయ క్రికెట్ పోటీలకు ఆంధ్రా అండర్-19 జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనుంది. విన్సెంట్ డీపాల్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ అమలామేరీ, పీడీలు నారాయణ రెడ్డి, సుధాకర్‌రెడ్డి.. మాన్వితను అభినందించారు.

న్యూస్ బాక్స్

నేడు ప్రజాదర్బార్

కదిరి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 11, 13, 14, 15 ,16, 17 వార్డులకు సంబంధించి ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి గురువారం ప్రకటన విడుదల చేశారు. పట్టణంలోని నిజాం వలీ కాలనీ సచివాలయంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 11, 13, 14, 15, 16, 17 వార్డులలో సమస్యలు తెలుసుకో వడానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా వార్డుల ప్రజలు సమస్యలపై అర్జీతో పాటు ఆధార్‌కార్డు, ఫోన్ నెంబర్ అందజేయాలని తెలిపారు. ఈ అవకాశాన్ని ఆయా వార్డుల ప్రజలందరూ ఉపయోగించుకోవాలని ప్రకటనలో కోరారు.

● ధర్మవరం: నియోజకవర్గ ప్రజల పరిష్కారమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రిసత్యకుమార్‌యాదవ్ ఆదేశాల మేరకు పట్టణంలోని ఎన్డీఏ కార్యాలయంలో శుక్రవారం 'ప్రజా దర్బార్-ప్రజలకు ఆత్మీయ ఆహ్వానం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను, వినతులను నేరుగా రాతపూర్వకంగా అందించవచ్చన్నారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

'రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలి'



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్టీఏ అధికారులు

ధర్మవరం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రోడ్డు నిబంధనలను తప్పక పాటించాలని ప్రైవేటు స్కూల్ బస్సుల డ్రైవర్లకు, వాహన దారులకు ఆర్టీఏ అధికారులు ఎంవీఐలు వరప్రసాద్, రాణి హెచ్చరించారు. గురువారం ప్రైవేటుస్కూల్ బస్సులను తనిఖీచేశారు. ఈ సందర్భంగా డ్రైవర్లకు, వాహనయజమానులకు పలు సూచనలు చేశారు. స్కూల్ బస్సులను కండీషన్‌లో ఉంచాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని సూచించారు. ఏదైనా అగ్నిప్రమాదాలు జరిగితే డ్రైవర్లు ఎలా వ్యవహరించానే విషయాలను, రోడ్డు భద్రత ని బంధనలను వివరించారు. అనంతరం డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయించారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ధర్మవరం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో గురువారం నుంచి 58వ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారి అంజలిసౌభాగ్యవతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వ్రారోత్సవాలు ఈ నెల 20వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తామన్నారు. 14న బాలలదినోత్సవం, 15న పుస్తకప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమాల్లో పాల్గొన్న ప్రముఖుల గురించి, 17న కవిసమ్మేళనం, 18న చిత్రలేఖనం, 19న ఉమెన్స్‌డే, 20న వారోత్సవాలు ముగింపు కార్యక్రమాలు ఉంటాయ న్నారు.

● తనకల్లు: మండలకేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో శుక్రవారం నుంచి 20వరకు 58వ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారి మస్తాన్‌వలీ తెలిపారు. పాఠకులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

సబ్సిడీతో ఉలవల పంపిణీ

బత్తలపల్లి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని రైతులకు సబ్సిడీతో ఉలవలు పంపిణీ చేస్తామని ఏఓ ఓబిరెడ్డి తెలిపారు. బత్తలపల్లి మండలానికి 250 క్వింటాళ్ల ఉలవలను ప్రభుత్వం కేటాయించిందని, కావలసిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. పదికిలోల ప్యాకెట్టు రూ. 560 కాగా 80శాతం సబ్సిడీ పోను రూ.112 చెల్లించి తీసుకోవాలని ఏఓ తెలిపారు.

మెగాజాబ్ మేళాకు స్పందన



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు

ధర్మవరం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షిర్డీసాయి బాబా ఆలయ ఆవరణంలోని కల్యాణమండపంలో గురువారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు మంచి స్పందన లభించినట్లు ఆలయ సేవాసమితి అధ్యక్షుడు వీరనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇంటర్మీడియట్, డిగ్రీ అర్హత కలిగిన వారు 65మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా, ఇంటర్వ్యూలో ఎల్‌ఎంఎస్ కంపెనీ ప్రతినిధులు 54 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారని తెలిపారు. ఎల్‌ఎంఎస్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ అస్లాం, షిర్డీ సాయిబాబా సేవాసమితి కార్యదర్శి రామలింగయ్య, ఉపాధ్యక్షులు నారాయణరెడ్డి, సహకార్యదర్శి నాయుడు, కోశాధికారి సూర్యనారాయణ, డైరెక్టర్లు సూర్యప్రకాశ్, హేమంత్‌కుమార్, ఎల్‌ఎంఎస్ కంపెనీ ప్రతినిదులు షామీర్, ఇమ్రాన్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి

ధర్మవరం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పార్టీలో చురుకుగా పనిచేస్తుండటాన్ని గుర్తించి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సిఫారసు మేరకు వైసీపీ రాష్ట్ర ఎస్సీసెల్ సెక్రటరీగా ధర్మవరం పట్టణానికి చెందిన చౌడప్పను నియమించారు. దీంతో చౌడప్ప బుధవారం తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ సీఎం జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. తనపై ఎంతో నమ్మకంతో బాధ్యతలు అప్పగించడంతో పార్టీ అభివృద్ధికి ఎటువంటి ఆటంకం లేకుండా పనిచేస్తానన్నారు. ఈ పదవిని ఇప్పించిన మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి, వైసీపీ శ్రేణులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

గుండెపోటుతో చేనేత కార్మికుడి మృతి



ఆలుకుంట్ల నరేశ్ (ఫైల్)

ధర్మవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాంతి నగర్‌కు చెందిన ఆలుకుంట్ల నరేశ్ (45) అనే చేనేత కార్మికుడు బుధవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గార్లదిన్నె మండలం మర్తాడు గ్రామానికి చెందిన ఆలుకుంట్ల నరేశ్ ధర్మవరం పట్టణంలో సొంత మగ్గం నేస్తూ జీవనం సాగించేవాడు. నేసిన చీరలకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో సొంత మగ్గాలను అమ్మేసి కొంత వరకు అప్పులు తీర్చాడు. ఇంకా అప్పులు ఉండటంతో కూలిమగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. తరచూ అప్పులను ఎలా తీర్చాలంటూ, దిక్కుతోచని పరిస్థితిలో తీవ్రమనస్థాపానికి గురయ్యేవాడు. ఈక్రమంలో బుధవారం ఉన్నఫలంగా చాతిలో నొప్పి రావడంతో నరేశ్ కుప్పకూలి పడిపోయాడు. దీంతో భార్య భాగ్యమ్మ చుట్టుపక్కల వారి సాయంతో ధర్మవరం ప్రభు త్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించగా అక్కడి వైద్యుల సలహా మేరకు రాత్రి బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్యతో కుమార్తె లిఖిత, కుమారుడు పార్థ ఉన్నారు.

మరమ్మతులు మరిచారా?



లీకేజీ వద్ద డివైడర్లను అడ్డం పెట్టిన దృశ్యం

కదిరి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ ఎదురుగా వడ్డే ఓబన్న విగ్రహం పక్కన పైపులైన్ లీకేజీ ఏర్పడింది. అది రోడ్డు మధ్యలో ఉంది. గత 20 రోజులుగా ఆ లీకేజీని తప్పించడానికి మూడు డివైడర్లను అడ్డం పెట్టారు. లీకేజీ ఏర్పడి 20 రోజులైనా మున్సిపాలిటీవారు మరమ్మతులు చేయడం పట్టించుకోలేదు. రోడ్డు మధ్యలో లీకేజీ ఉండడంతో వాహనాల రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లీకేజీ మరమ్మతులు చేయడం మున్సిపల్ అధికారులు మరిచారా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి ప్రజలకు అసౌకర్యంగా ఉన్న లీకేజీకి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పేదల వైద్యానికి పెద్దపీట

- మెడికల్ కాలేజీల విషయంలో ఫోజులిస్తున్న వైసీపీ నాయకులు
- ఎమ్మెల్యే కందికుంట



సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): పేదల వైద్యానికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేసిందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో గురువారం రూ.46లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేదల వైద్యానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పెద్ద పీట వేస్తున్నారన్నారు. గురువారం 41మంది లబ్ధిదారులకు రూ.46లక్షల చెక్కులను అందచేసినట్లు తెలిపారు. గడిచిన 15నెలలో రూ.2.25లక్షల వరకు పేదల వైద్యానికి ఖర్చు చేశామన్నారు. మెడికల్ కాలేజీల కోసం పోరాడుతున్నట్లు వైసీపీ నాయకులు కేవలం ఫోజులిస్తున్నారని విమర్శించారు. ప్రజలకు వైద్యం కోసం గొప్పగా ఆలోచించే వ్యక్తి సీఎం చంద్రబాబే అన్నారు. పీపీపీ విధానం ద్వారా మెడికల్ సీట్లు పెరుగుతాయన్నారు. వైసీపీ నాయకులు తమ ఉనికి కోసం మందు, బిర్యానీలు పంచి జనాలను తీసుకొస్తున్నారని, కానీ ప్రభుత్వంపై వ్యతిరేకతతో ప్రజలు వారి తరపున రావడంలేదన్నారు. గడిచిన 15నెలల కాలంలో ఇచ్చిన హామీలన్నీ నేరవేర్చామన్నారు. వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషాశ్రీచరణ్ ఒక్కసారి ఆర్టీసీ బస్సుఎక్కితే ప్రయాణం ఉచితమో కాదో తెలుస్తుందన్నారు. వైసీపీ వారు చేసిన అకృత్యాలను ఇంకా ప్రజలు మరిచిపోలేదన్నారు. పీపీకిట్లు అడిగిన డాక్టర్లను పిచ్చోళ్లను చేసిన చరిత్ర, కరోనా సమయంలో ఉపాధ్యాయులను మద్యం షాపులో నిలపెట్టిన ఘనత వారికే దక్కుతుందన్నారు. అక్రమ మద్యం వ్యాపారంతో ప్రజల జీవితాలతో ఆడుకున్నారన్నారు. వారి తప్పులను ప్రశ్నించిన వారు శవాలుగా మారలేదా అన్నారు. వారు చేసిన తప్పులకు ప్రజలు 151నుంచి 11సీట్లకు పరిమితం చేసినా బుద్ధిలేకుండా ప్రతిపక్ష హోదా అడుగుతున్నారని ఎద్దేవా చేశారు. చౌకబారు విమర్శలు మాని ప్రజాహితంకోసం పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలి: డీటీఎఫ్



ప్రధానికి పోస్టు కార్డు ద్వారా లేఖ పంపుతున్న ఉపాధ్యాయులు

ఓబుళదేవరచెరువు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలని కోరుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీకి లేఖ పంపినట్లు డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు కట్టుబడి గౌస్ లాజం తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే ఉద్యోగంలో ఉన్న ఉపాధ్యాయులకు టెట్‌లో మినహాయింపు ఇచ్చే విధంగా చూడాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్‌కు లేఖ రాశామన్నారు. టెట్ నుంచి మినహాయింపు చర్యలు చేపట్టాలని, 2010 సంవత్సరానికి మునుపు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ పాసై ఉండాలనే సుప్రీంకోర్టు తీర్పును సవరిస్తూ కేంద్రం చట్టం తీసుకురావాలని కోరామన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని కోరామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సోమశేఖర్‌నాయక్, వెంకటాచలమయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతుసంఘం ఆధ్వర్యంలో నేడు ధర్నా

ధర్మవరం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న రైతుల సమస్యలపై శుక్రవారం ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, జిల్లా సహాయకార్యదర్శి మారుతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా మొక్కజొన్న పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, మొక్కజొన్న రైతులను అన్నివిధాలుగా ఆదుకోవాలని కోరారు. మొక్కజొన్న రైతులకు నష్టపరిహారం అందించాలన్న డిమాండ్లతో ఉదయం 10గంటల కు ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున రైతులు తరలివచ్చి విజయవంతం చేయాలని వారు కోరారు.

టీడీపీ నాయకుడికి ఎమ్మెల్యే పరిటాల సునీత నివాళి



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే

నల్లచెరువు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్న యల్లంపల్లికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు గాలివీటి శ్రీరాములు నాయుడు అనారోగ్యంతో ఈ నెల 6న మృతి చెందిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యే పరిటాల సునీత గురువారం చిన్నయల్లంపల్లిలోని గాలివీటి శ్రీరాములు నాయుడు నివాసానికి వెళ్లి శ్రీరాములునాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతుడి కుమారుడైన గాలివీటి కృష్ణమోహన్ నాయుడుతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పోలీసులకు తహసీల్దార్ ఫిర్యాదు

గాండ్లపెంట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తన విధులకు ఆటంకం కలిగించారని స్థానిక తహసీల్దార్ బాబురావ్ ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ గురువారం తెలిపారు. తాను సోమవారం విధులు నిర్వహిస్తున్న సమయంలో మలమీదపల్లి పంచాయతీ కోటూరుకు చెందిన రామాంజునేయులు ఆటంకం కలిగించారని, వీడియో తీసి సోషల్‌మీడియా వైరల్ చేసినట్లు తహసీల్దార్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

దోమల నివారణకు ఫాగింగ్

అమడగూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మహమ్మదాబాద్ గ్రామ సచివాలయం పరిధిలో అన్ని గ్రామాలలో గురువారం సెక్రటరీ జానకీ దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు. మహమ్మదాబాద్ ఎస్సీ కాలనీలో దోమలు అధికంగా ఉండటంతో విషజ్వరాలు ప్రబలు తున్నాయని ఆమె తెలిపారు. దోమల నివారణకు గ్రామాల్లో మురుగు కాలువలు, పచ్చిక ఎక్కువగా ఉన్న స్థలాలో ఫాగింగ్ చేసి నట్లు తెలిపారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇష్టానుసారం మాట్లాడటం తగదు

● మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డిపై హరీశ్‌బాబు ధ్వజం

ధర్మవరం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఇష్టానుసారంగా నోటికొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదనిన మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పై హరీశ్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో గత ఐదేళ్ల పాలనలో వైసీపీ చేయలేని అభివృద్ధిని కేవలం 16నెలల్లో బీజేపీ చేసి నిరూపించుకుందని అన్నారు. పట్టణంలోని ఎన్డీఏ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి ఇతరుల గురించి మాట్లాడేటప్పుడు ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలన్నారు. మంత్రి సత్యకుమార్‌యాదవ్ 16నెలల కాలంలోనే నిధులు తీసుకొచ్చి ధర్మవరం అభివృద్ధికి పునాది వేశారన్నారు. అభివృద్ధిని ప్రోత్సహించాల్సిన మాజీ ఎమ్మెల్యే బీజే పీ కార్యకర్తలను జాగిలాలు అంటున్నాడని, ఆ జాగిలాలే ఈ దేశభద్రతకు ప్రాణాలు అర్పించారన్నారు. ధర్మవరం ప్రజల కోసం తాము వెంకయ్యానాయుడు వద్ద లాబీయింగ్ చేస్తున్నామని, మీ లాగా తిన్నింటి వాసాలు లెక్కపెట్టే పరిస్థితి మాకు లేదన్నారు. మెడికల్ కాలేజీల నిధుల విషయంలో రూ.700కోట్లు సీఎం దోచుకున్నారని కేతిరెడ్డి మాట్లాడడం పూర్తిగా అవాస్తవమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జింకా చంద్రశేఖర్, గొట్లూరు చంద్ర, సాకే ఓబుళేశు, నబీరసూల్, లక్ష్మీనారాయణ, బిల్లే శీనా, భక్తవత్సలం నాయుడు పాల్గొన్నారు.

దుద్దుకుంటా... అనుచిత వ్యాఖ్యలు మానుకో

● ఏపీ ఎస్ఐడీసీ డైరెక్టర్ పత్తి చంద్రశేఖర్

కొత్తచెరువు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఇప్పటికైనా మానుకోవాలని ఏపీఎస్ఐడీసీ డైరెక్టర్ పత్తిచంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు నిన్ను చిత్తుచిత్తుగా ఓడించిన బుద్దిరాలేదా అంటూ మండిపడ్డారు. మీ నాయకులు చేసిన నిర్వాహకం వల్ల రాష్ట్రం అప్పుల పాలైందని, మీకు దోచుకోవడం, దాచుకోవడమే తప్ప ప్రజలకు ఏమైనా చేశారా అని ప్రశ్నించారు. అప్పులు తప్ప ఏమీ చేయలేదన్నారు. మీ మనుగడ కోసం మీ కార్యకర్తల వద్ద తప్పుడు కూతలు కూస్తూ ఉత్సాహ పరచవచ్చునేమో కానీ ప్రజల్లో మా నాయకులు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు ఉన్న గౌరవాన్ని తగ్గించలేరు కదా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక, పార్టీ కనుమరుగవుతుందన్న భయంతో మీ నాయకుడు జగన్, కోటరీలు ఇలాంటి చౌకబారు ప్రకటనలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా విమర్శలు మానుకొని అభివృద్ధికి సహకరించాలని ఆయన హితవు పలికారు.

రేషన్ దుకాణాల తూనికల పరిశీలన

గాండ్లపెంట, నవంబరు13(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ దుకాణాల తూనికలను ధర్మవరం డివిజన్ తూనికల అధికారి శివశంకర్ గురువారం పరిశీలించారు. మండల వ్యాప్తంగా 24 రేషన్ షాపులలో ఉన్న తూనికలను పరిశీలిం చారు. ప్రతి ఏడాది నిర్వహించే పరిశీలనలో భాగంగా రేషన్ షాపుల్లో తూనికల ను పరిశీలించి సర్టిఫికెట్ అందజేసినట్లు ఆయనతెలిపారు. ప్రతి వ్యాపారి తూనికల అధికారి నుంచి గుర్తింపు పొందిన తూనిక మిషన్‌లను మాత్రమే వ్యాపారంలో వినియోగించాలని తెలిపారు. తూకాల్లో మోసగించినట్లు అలాంటి ఎవరిపైన అయినా ఫిర్యాదు వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

అనాథ మహిళకు ఆశ్రయం

కదిరి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో రెండు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న కవిత అనే మహిళను గురువారం అమడగూరు మండలంలోని మాతృశ్రీ ఆశ్రమ నిర్వాహకురాలు అరుణజ్యోతి తన ఆశ్రమానికి తీసుకెళ్లారు. కాలు, తలలో తీవ్ర గాయాలతో ఆసుపత్రి వద్ద దీనావస్థలో ఉన్న మహిళను కేఈకే ట్రస్ట్ వారు గుర్తించి అరుణజ్యోతికి ఫోన్ ద్వారా తెలిపారు. ఆమె కదిరి ప్రభుత్వాస్పత్రికి వచ్చి మహిళ పరిస్థితిని గమనించారు. అక్కడే వైద్యులతో చికిత్సలు చేయించారు. పట్టణ సీఐ నారాయణరెడ్డి అనుమతితో ఆ మహిళను తన ఆశ్రమా నికి తీసుకెళ్లారు. ఆమె పేరు కవితగా చెబుతున్నట్లు అరుణజ్యోతి తెలిపారు.

ఉచిత పశువైద్యశిబిరం

తనకల్లు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాలవారిపల్లిలో గురువారం ఉచిత పశువైద్యశిబిరం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ కున్నయ్య సత్యసాయి ట్రస్టు సభ్యుడిగా ఉన్నారు. ఆయన సహకారంతో పశువైద్యశిబిరానికి అవసరమైన మందులు కొనుగోలు చేసి, ఉచితంగా రైతులకు అందించినట్లు డాక్టర్ రవినాయక్ తెలిపారు. పశువులకు అవసరమైన మందులు, నట్టల నివారణ మాత్రలు, పోషకద్రావకాలు అందించినట్లు తెలిపారు. తమ గ్రామంలో ఉచిత వైద్యశిబిరానికి సహకరించిన సత్యసాయి ట్రస్టు సభ్యులు డాక్టర్ కున్నయ్యకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డుపైనే మురుగునీరు



పెడబల్లి రోడ్డుపై నిలువ ఉన్న మురుగునీరు

నంబులపూలకుంట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పెడబల్లి రోడ్డులో మసీదు సమీపంలో మురుగునీరు రోడ్డుపై నిలువ ఉంది.. దీంతో వాహనాల రాకపోకల సమయంలో ఈ నీరు పాదాచారులపై ఎగిరిపడుతోంది. దీంతో మసీదులో ప్రార్థనలు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నట్లు స్థానిక ముస్లింలు తెలిపారు. బట్టలు శుభ్రం చేయడం, పాత్రలు శుభ్రం చేసే నీరు రోడ్డుపైకి వేస్తుండడంతో ఈ నీరు నిలువ ఉంటున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, మురుగునీరు నిలువ లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

చెరువులకు నీరు విడుదల



నీరు విడుదల చేస్తున్న అధికారులు, నాయకులు

ముదిగుబ్బ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌ల ఆదేశాల మేరకు, మండల పరిధిలోని అడవి బ్రాహ్మణపల్లి సమీపంలోని యోగివేమన రిజర్వాయర్ నుంచి కుడి కాలువకు గురువారం నీటిని విడుదల చేశారు. కాలువ కింద ఉన్న అంకన్నకుంట, కొడవాండ్లపల్లి చెరువులకు 60 క్యూసెక్కుల నీరు విడుదల చేశారురు. కొడవాండ్లపల్లి సమీపంలో 250 ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నారని, భూగర్భ జలాలు పెరిగేందుకు రైతుల విజ్ఞప్తి మేరకు విడుదల చేసినట్లు రిజర్వాయర్ జేఈ కృష్ణకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఈతో పాటు ప్రాజెక్ట్ చైర్మన్ గోడి జయప్రకాశ్, వైస్ చైర్మన్ శివయ్య, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి రమేష్ బాబు, టీడీపీ నాయకులు తుమ్మల మనోహర్, టీడీపీ రమణారెడ్డి, మల్లెల నారాయణస్వామి, వెంకటనారాయణ, లింగుట్ల నారాయణస్వామి, అనీఫ్, రాముడు, ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

పేద ముస్లింలకు అండగా సీఎం

దర్గా కమిటీ చైర్మన్

కొత్తచెరువు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేద ముస్లింల అభివృద్ధికి పాటు పడుతోంది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే అని స్థానిక మస్తాన్ స్వామి దర్గాకమిటి చైర్మన్ మాణిక్యంబాబా అన్నారు. మండల కేంద్రంలోని దర్గా కాంప్లెక్స్‌లో గురువారం స్థానిక ముస్లింలు, ఇమాంలు, మౌజన్‌లతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. 2016లోనే సీఎం చంద్రబాబు దేశంలోనే మొదటిసారిగా మౌజన్‌లకు, ఇమామ్‌లకు గౌరవ వేతనం అందించారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో నా ముస్లింలు, నా బీసీలు అన్న జగన్ ముస్లింల అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇమామ్‌లకు, మౌజన్‌లకు రాష్ట్ర వ్యాప్తంగా రూ.90కోట్ల మంజూరు చేయడం సంతోషకరమన్నారు. అదేవిధంగా ముస్లిం పేద విద్యార్థుల చదువుకు పెద్ద పీట వేస్తున్నారని ఆయన కొనియాడారు. ముస్లింలు సైకిల్‌షాపు బాబా, నూర్, అన్వర్, షఫీ, రోషన్, బషీర్, సలీం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో ధర్మవరం విద్యార్థి ప్రతిభ



విద్యార్థితో హెచ్‌ఎం, సైన్స్ ఉపాధ్యాయులు

ధర్మవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాంతి నగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న శంకరపు గణేశ్ రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌లో ప్రతిభ కనబరచారని ఆ పాఠశాల హెచ్‌ఎం ఉమాపతి, సైన్స్ ఉపాధ్యాయులు ఎస్‌బీ రేఖ, ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి గణేశ్‌ను గురువారం పాఠశాలలో వారు అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.... గత నెల 17వ తేదీన విజయవాడలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన సైన్స్ సెమినార్‌లో క్వాంటమ్, జనరల్ కంప్యూటర్ మధ్య తేడాను వివరించాడన్నారు. దీంతో విద్యార్థి గణేశ్‌ను సమగ్రశిక్ష తరపున డిసెంబరు 27 నుంచి జనవరి 4వతేదీ వరకు గుజరాత్‌కు సైన్స్ టూర్‌పై వెళ్తున్నట్టు హెచ్‌ఎం, సైన్స్ ఉపాధ్యాయులు తెలిపారు.

ఎమ్మార్పీకే విక్రయించాలి: ఏడీఏ

ధర్మవరం రూరల్, నవంబరు13(ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణా ల్లో ఎరువులు, రసాయనిక మందులను రైతులకు ఎమ్మార్పీకే విక్రయించాలని ఏడీఏ లక్ష్మా నాయక్ సూచించారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన గురువారం పట్టణంలోని డీసీఎంఎస్ ఎరువుల విక్రయకేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు అమ్మిన తర్వాత రసీదులను తప్పనిసరిగా రైతులకు ఇవ్వాలన్నారు. షాపుల వద్ద ధరల పట్టిక ఉంచాలన్నారు. నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఏఓ ముస్తఫా ఉన్నారు.

కనకదాస జయంతిని విజయవంతం చేద్దాం

కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ పరిమళ



వేడుకలకు ఆహ్వానిస్తున్న పరిమళ

చిలమత్తూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): హిందూపురంలో ఎమ్మెల్యే బాలకృష్ణ ఆధ్వర్యంలో ఈనెల 16న కనకదాస జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నామని, విజయవంతం చేయాలని కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పరిమళ పిలుపునిచ్చారు. గురువారం ఆమె చిలమత్తూరు మండలంలో పర్యటించి కురుబ కులస్థుల ఇంటింటికి వెళ్లి జయంతి వేడుకలకు కుటుంబ సమేతంగా ఆహ్వానించారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే బాలకృష్ణ కురుబల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. ఆయన ఆధ్వర్యంలో జరిగే ఈ వేడుకలను విజయవంతం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆమె కోరారు.

రోడ్డుపైకి పశువులు

- పట్టించుకోని అధికారులు



రోడ్డుపైన సంచరిస్తున్న పశువులు

సోమందేపల్లి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హైస్కూలు, ఎన్టీఆర్‌సర్కిల్, కొత్తపల్లి క్రాస్, మార్కెట్‌యార్డ్ తదితర ప్రాంతాల్లో పశువులు రోడ్డుపై సంచరిస్తుండటంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇటీవల ఎన్టీఆర్ సర్కిల్‌లో బస్సు ఢీకొని పశువులు గాయపడ్డాయి. అదేవిధంగా కొత్తపల్లి క్రాస్‌వద్ద పలుమార్లు ద్విచక్రవాహనదారులు పశువులను తప్పించబోయి ప్రమాదాలబారిన పడ్డారు. పశువుల యజమానులు వాటిని రోడ్డుపైకి వదిలిపెడుతుండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారాయి. ఇక ప్రతి వారం జరిగే వారపు సంతలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. దుకాణదారులపై దాడులకు తెగబడటమేకాక పాదచారులను నెట్టుకుంటూ వృద్ధులు, మహిళలను కిందపడేస్తున్నాయి. వీటిని కట్టడి చేయాలని పంచాయతీవారికి పలుమార్లు స్థానికులు మొరపెట్టుకున్నారు. అయితే స్పందించలేదని వారు అంటున్నారు. పోలీసులు సైతం పశువులను రోడ్డుపైకి వదిలితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించినా ఫలితం లేకుండాపోయింది. రోజు రోజుకు పశువుల బెడద అధికం అవుతుండటంతో బజారులో దుకాణదారులు, వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వాటిని కట్టడి చేసేవిధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దత్తత మాసంపై అవగాహన



సంచార జాతులవారికి అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

గోరంట్ల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రాంతాల్లోని గుడిసెల్లో నివాసముంటున్న వారికి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దత్తతమాసంపై గురువారం అవగాహన కల్పించారు. గోరంట్లలోని పులేరు రోడ్డులో గుడరాలు వేసుకుని ఉంటున్నవారికి చట్టపరమైన దత్తత, సంతానం లేని దంపతులకు పిల్లలను చట్టపరంగా దత్తత తీసుకోవడం, తదితర విషయాలపై అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి అవగాహన కల్పించారు. నిరాదరణకు గురైన పిల్లలు, ముళ్లపొదలు, చెత్తకుప్పల్లోనూ పిల్లలను గుర్తించిన వెంటనే గ్రామంలోని ప్రభుత్వ అధికారులకు లేదా చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు తెలియచేయాలన్నారు. కార్యక్రమంలో మహిళ పోలీస్ హేమావతి, ఏఎన్‌ఎం ప్రమీల, అంగన్‌వాడీ కార్యకర్త పద్మావతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య

రొద్దం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): అతిగా మద్యం సేవించి కురుబ శ్రీనివాసులు(54) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం రాత్రి రొద్దం మండలం సానిపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులు గ్రామ సమీపంలో చెట్టుకు ఉరివేసుకుని మృతిచెందాడు. గురువారం ఉదయం గ్రామస్థులు బంధువులకు సమాచారం అందించగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ వీరాంజనేయులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు మండల కమిటీ ప్రమాణ స్వీకారం

మడకశిర టౌన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కొత్తగా ఎంపికైన మండల కమిటీ అధ్యక్షుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు పట్టణ అధ్యక్షుడు నాగరాజు తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 10 గంటలకు ఉంటుందన్నారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో కొత్తగా ఎంపికైన అన్ని మండలాల అధ్యక్షులు, క్లష్టర్, యూనిట్, బూత్ కన్వీనర్లు, కో-కన్వీనర్లు, గ్రామ వార్డు కమిటీ అధ్యక్షులు, పదవీ బాధ్యతల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ



సుధాకర్

రొళ్ల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల ఈఓఆర్డీగా సుధాకర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. అమరాపురం మండలంలో గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న సుధాకర్ ఈఓఆర్డీగా పదోన్నతి పొంది బదిలీపై రొళ్ల మండలానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

శిక్షణా తరగతుల పరిశీలన

పెనుకొండ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక జూనియర్ కళాశాలలో ఏఅండ్‌టి గ్రూపునకు చెందిన విద్యార్థులకు సంబంధించి శిక్షణ తరగతులను జిల్లా త్రిసభ్య కమిటీ సభ్యుడు చాంద్‌బాషా గురువారం పరిశీలించారు. ఓజెటిలో భాగంగా ఎల్‌ఐసి ఆఫీస్ కంప్యూటర్ శిక్షణలో ఉన్న విద్యార్థులను వృత్తినైపుణ్యం అంశాలపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుదర్శన్, అధ్యాపకులు రవికుమార్, హారిక తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు తగ్గిన పట్టుగూళ్లు

రాయితీలు లేనందునే అంటున్న రైతులు

గూళ్లు లేకనే అంటున్న అధికారులు



బుధవారం గూళ్లు రాక వెలవెలబోతున్న జాలరీలు

హిందూపురం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే హిందూపురం పట్టుగూళ్ల మార్కెట్ అతిపెద్దది. కొన్ని సందర్భాల్లో రోజుకు పది నుంచి 14 టన్నులదాకా పట్టుగూళ్లు వచ్చాయి. సమైక్యాంధ్ర ఉద్యమం, లాక్‌డౌన్ మినహాయించి హిందూపురం పట్టుగూళ్లు రాని రోజు లేదంటూ రైతులంటున్నారు. అలాంటిది బుధవారం ఒక్క కిలోకూడా పట్టుగూళ్లు రాకపోవడం ఏంటని వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు. ఒక్కలాట్ కూడా రాకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటని అధికారులే నివ్వెర పోతున్నారు. దీనిపై సెరికల్చర్ అధికారులు మాట్లాడుతూ ఇన్సెంటివ్, రాయితీలు ఇవ్వనందుకు కాదని, తయారైన గుడ్లు లేకనే మార్కెట్‌కు రాలేదంటున్నారు.

కర్ణాటక రైతుల పేరుతో రాయితీలు

కర్ణాటకలో కూడా బైవోల్టిన్ పట్టుగూళ్లకు సంబంధించి కిలోకు రైతుకు రూ.30 ఇన్సెంటివ్ ఇస్తున్నారు. దీంతో హిందూపురం, మడకశిర, పెనుకొండ, గోరంట్ల ప్రాంతాలకు చెందిన రైతులకు సంబంధించిన బంధువులు కర్ణాటకలో ఉన్నారు. వారి పేరుమీద కర్ణాటక పట్టుగూళ్ల మార్కెట్‌కు తీసుకెళ్లి రాయితీలు పొందుతున్నారు. ఇదే హిందూపురం మార్కెట్‌కు గూళ్లు రాకపోవడానికి ప్రధాన కారణంగా తెలుస్తుంది. మన రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇన్సెంటివ్, రీలర్లకు రాయితీ ఇస్తే పట్టుగూళ్లు హిందూపురానికి వచ్చే అవకాశం ఉందని, లేదంటే రోజు రోజుకు తగ్గిపోయే అవకాశాలు ఉన్నట్లు వ్యాపారులు అంటున్నారు. కాగా గురువారం 680 కేజీల పట్టుగూళ్లు వచ్చాయి.

ఇలా అయితే మార్కెట్ మూతే..



ప్రభుత్వం పట్టు రైతులకు ఇవ్వాల్సిన ఇన్సెంటివ్ ఇవ్వకపోతే హిందూపురం పట్టుగూళ్ల మార్కెట్ శాశ్వతంగా మూతబడే అవకాశం ఉంది. ప్రభుత్వం స్పందించి బైవోల్టిన్ గుడ్లకు ఇన్సెంటివ్‌ను ఎప్పటికప్పుడు అందజేయాలి.

- రాజేష్, పరిగి

కర్ణాటకలో ధర కూడా ఎక్కువ



మన పట్టుగూళ్ల మార్కెట్‌కంటే కర్ణాటక నయం. అక్కడున్న సిడ్లగట్ట విజయ్‌పూర్ రాంనగర్ పట్టుగూళ్ల మార్కెట్‌కు తీసుకెళ్తే ఇక్కడికంటే ధర అక్కడ అధికం. దీంతోపాటు ఇన్సెంటివ్‌కూడా ఎప్పటికప్పుడు అందిస్తారు.

- రామాంజినప్ప, వీబూదిపల్లి

ఇలా అయితే బజారున పడతాం..

పట్టుగూళ్ల రైతులకు ఇన్సెంటివ్ ఎప్పటికప్పుడు అందించి ఆదుకోవాలి. రీలర్లకు రాయితీ ఇన్సెంటివ్ ఏ నెలకానెల అందజేయాలి. లేదంటే రైతులు మార్కెట్‌కు గూళ్లు తీసుకురారు. అన్నీ కర్ణాటకకే తరలిపోతాయి. దీనివల్ల హిందూపురంలో ఉన్న వందలాది మంది రీలర్లు వాటిని నమ్ముకున్న కుటుంబాలు బజారునపడతాయి. ప్రభుత్వం దీనిపై స్పందించాలి.

- ముస్తఫా, పట్టురీలర్ల సంఘం నాయకుడు

గూళ్లు తయారు కాలేదు

బుధవారం మార్కెట్‌కు వచ్చే పట్టుగూళ్లు రాకపోవడానికి కారణం ఈరోజుకు సంబంధించి చాకి కాకపోవడమే కారణం. అయితే ఒకరోజు పూర్తిగా మార్కెట్‌కు రాకపోవడం ఈ మధ్యకాలంలో ఇదే మొదటిసారి. ఇన్సెంటివ్ రాయితీల కోసం రైతులు రాలేదని చెప్పడం వాస్తవం కాదు. కర్ణాటకకంటే ధరలో మనమే ముందున్నాం.

- రాజు, ఏడీ, సెరికల్చర్, హిందూపురం

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



టీడీపీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి సవిత

పరిగి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కాలువపల్లి గ్రామ వైసీపీకి చెందిన పదికుటుంబాలు గురువారం మంత్రి సవిత సమక్షంలో టీడీపీలో చేరారు. స్థానిక టీడీపీ నాయకులు కొడిగెనహళ్లి పంచాయతీ కన్వీనర్ గంగాధరప్ప ఆధ్వర్యంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి మంత్రి సవిత పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి చేపడుతున్న సంక్షేమ పథకాలు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని చూసి ఆకర్షితులై పార్టీలో చేరడం జరిగిందన్నారు. అశ్వర్థప్ప, ఆంజనేయులు, శంకరప్ప, పెద్దయ్య, తిమ్మయ్య, శివప్రసాద్, అశ్వర్థప్ప, మల్లికార్జున, నాగేశ్వర్‌రావు ముద్దయ్య తదితరులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో సత్యసాయిజిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, మండల కన్వీనర్ గోవిందరెడ్డి, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన స్థలం అందరిదీ..

● తహసీల్దార్ సౌజన్యలక్ష్మి



శ్మశాన స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సౌజన్యలక్ష్మి

లేపాక్షి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): లేపాక్షి పాతూరు వీవర్స్‌కాలనీకి చెందిన శ్మశాన స్థలం అన్ని వర్గాలవారికి వర్తిస్తుందని తహసీల్దార్ సౌజన్యలక్ష్మీ అన్నారు. జాతీయరహదారి పక్కనున్న శ్మశానస్థలం కొంతభాగం రహదారికి వెళ్లిపోగా మిగిలిన కొంత స్థలాన్ని ఓ వర్గంవారు మట్టితోలి చదునుచేసుకున్నారు. ఆ స్థలంలో ఆ వర్గంవారినే పూడ్చాలని అనడంతో వీవర్స్‌కాలనీవారు అందరికీ సంబంధించిన శ్మశానస్థలమని, ఒకవర్గంవారినే పూడ్చాలనడం సబబుకాదని గొడవకు దిగారు. విషయం తహసీల్దార్ సౌజన్యలక్ష్మి దృష్టికి తీసుకెళ్లగా శ్మశానాన్ని పరిశీలించి అందరికీ స్థలం వర్తిస్తుందన్నారు. దీంతో సమస్య సద్దుమణిగింది.

మంచి వ్యక్తిత్వంతోనే మానసిక స్థైర్యం

● సైకాలజిస్ట్ ధాత్రి

హిందూపురం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మంచి వ్యక్తిత్వమే మానసిక స్థైర్యమని బెంగళూరు జైన్ విశ్వవిద్యాలయ సైకాలజిస్ట్ ధాత్రి అన్నారు. గురువారం ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్, రెడ్‌రిబ్బన్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థినులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా అదే కళాశాలలో చదివి బెంగళూరులో సైకాలజిస్ట్‌గా పనిచేస్తున్న ధాత్రి హాజరై మాట్లాడారు. విద్యార్థినులకు, యువతకు ఆదర్శ భావాలు, మంచి వ్యక్తిత్వమే అతిపెద్ద మానసిక బలమని తాత్కాలిక ఇబ్బందులు ఎదురైనప్పటికీ ఒత్తిడిని జయించాలన్న సంకల్పం పెంచుకుని విజయం కోసం పోరాడాలన్నారు. సమస్యలు ఎదురైనప్పుడు మానసికంగా కుంగిపోకుండా ధైర్యంగా ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రగతి, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశు, రెడ్‌రిబ్బన్ క్లబ్ ఇన్చార్జ్ అమరేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వడ్డెర భాయ్‌చారా రాష్ట్ర కమిటీ కన్వీనర్‌గా నాగరాజు

హిందూపురం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్‌పార్టీ వడ్డెర భాయ్ చారా కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా కొల్లకుంటకు చెందిన నాగరాజును ఎంపిక చేసినట్లు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్‌కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే బీఎస్పీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న తనను వడ్డెరభాయ్ చారా కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా ఎంపిక చేయడంపట్ల రాష్ట్ర అధ్యక్షునికి నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషిచేస్తానన్నారు.

బాలుర డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయండి

ఏఐఎస్‌బీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి

హిందూపురం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఏఐఎస్‌బీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం హిందూపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ హిందూపురం నియోజకవర్గంలోని లేపాక్షి, చిలమత్తూరు, పెనుకొండ మండలంలోని పరిగి, సోమందేపల్లి మండలాల నుంచి విద్యార్థులు డిగ్రీ చదువుకోవడానికి హిందూపురానికి వస్తుంటారన్నారు.అయితే ప్రభుత్వ బాలుర డిగ్రీకళాశాల లేకపోవడంతో ప్రైవేట్ కళాశాలలకు వెళ్తున్నారన్నారు. అక్కడ ఫీజులు చెల్లించలేక చాలామంది పేద విద్యార్థులు ఇంటర్‌కే పరిమితమవుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ బాలుర డిగ్రీకళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ వెంకటేశులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌బి నాయకులు పవన్, గోపీ, భరత్‌రెడ్డి, ఉపేంద్రరెడ్డి, రఘు, వినోద్, ఉమేష్, కళ్యాణ్, వేణు, సాయి తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ కాలువ పనులు ప్రారంభం



పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు, నాయకులు

పెనుకొండ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బ్యాంక్ సర్కిల్‌వద్ద శిథిలావస్థకు చేరుకున్న డ్రైనేజీ పనులను ఎట్టకేలకు గురువారం ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని డ్రైనేజీవల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండటాన్ని గమనించి టీడీపీ నాయకులు మంత్రి సవిత దృష్టికి తీసుకెళ్లగా ఆమె స్పందించి రూ.4.5లక్షలు నిధులను మంజూరు చేశారు. గురువారం మున్సిపల్ కార్యాలయం సిబ్బంది, టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో నిర్మాణ పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీరాములు, బాబులోరెడ్డి, త్రివేంద్రనాయుడు, సమీవుల్లా, చంద్ర, రఘు, నంజప్ప, బీజేపీ రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

కారుబోల్తా.. 9మందికి గాయాలు



జాతీయ రహదారి పక్కన బోల్తాపడిన కారు

పెనుకొండ రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పెనుకొండ మండలంలోని అమ్మవారిపల్లి సమీపంలో జాతీయరహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 9మంది గాయపడినట్లు పోలీసులు తెలిపారు. రొద్దం మండలం నారనాగేపల్లికి చెందిన గంగాధర్ కుటుంబ సభ్యులు కవిత, కాలమ్మ, సుజాత, అనురాధ, అశ్విని, హేమావతి, మోక్షిత, అవినాశ్, శృతి బెంగళూరు నుంచి కారులో కర్నూలు జిల్లా అహోబిళం దర్శనానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో అమ్మవారిపల్లి వద్దకు రాగానే కారు ప్రమాదవశాత్తు అదుపుతప్పి రోడ్డుపక్కన 30మీటర్ల లోతుకు బోల్తాపడి చెట్లలోకి దూసుకెళ్లిపోయింది. ప్రమాదంలో తొమ్మిది మందికి గాయాలుకాగా వీరిని పోలీసులు హుటాహుటిన పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన కవితను బెంగళూరు ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాఠశాల తనిఖీ



విద్యార్థులకు సూచనలిస్తున్న లాజరు

రొద్దం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను సత్యసాయి జిల్లా ఏసీ లాజరు గురువారం పరిశీలించారు. 10వ తరగతి విద్యార్థులతో పరీక్షలపై చర్చించారు. మార్చిలో జరిగే పది పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. ఇష్టంతో చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు. ప్రణాళికబద్ధంగా చదివితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. పరీక్షా కేంద్రంలో ఉన్న సౌకర్యాలపై హెచ్‌ఎం లక్ష్మీనారాయణతో ఆరాతీశారు.

నేటి నుంచి కుంభాభిషేక వేడుకలు



మహాలక్ష్మి అమ్మవారి మూలవిరాట్

అమరాపురం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బసవనపల్లి గ్రామంలో వెలసిన మహాలక్ష్మి, భూతప్ప స్వాముల దేవాలయాల్లో కుంభాభిషేక ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ అధ్యక్షుడు పరమేశ్వరప్ప, ఉపాధ్యక్షుడు రాజశేఖర్, కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి దేవరాజ్ గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజులపాటు వేడుకలు జరుగుతాయన్నారు. శుక్రవారం ఆలయ శుద్ధీకరణ, అన్నసంతర్పణ, కుంభాభిషేకం, మహా మంగళహారతి, సాయంత్రం 6గంటలకు దీపోత్సవం ఉంటుందన్నారు. శనివారం భూతప్ప స్వామి దేవవాలయంలో విశేష పూజలు, అభిషేకాలు, తీర్థప్రసాదాల వినియోగం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు ప్రకటనలో కోరారు.

నేడు పార్శ్వనాథస్వామి ఆలయంలో పూజలు

పెనుకొండ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): భారతదేశంలో ఉన్న నాలుగు ప్రసిద్ధిచెందిన జైన పీఠాల్లో ఒక్కటైన పెనుకొండలోని పార్శ్వనాథస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు అజిత ప్రసాద్ జైన్ తెలిపారు. అనంతరం ఆలయ నూతన కమిటీని ఎన్నుకోవడం జరుగుతుందన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎంఈఓ తదితరులు

గోరంట్ల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం అవుతున్నట్లు గ్రంథాలయ అధికారి శ్రీధర్ తెలిపా రు. వారోత్సవాలు 20వతేదీ వరకు జరుగుతాయన్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఎంఈఓ గోపాల్ గురువారం విడుదల చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ నాయకులు శ్రీరాములు, ఆదినారాయణ, శ్రీదేవి, శ్రీనివాసగుప్త, రమేష్, నరహరమూర్తి, వెంకటరమణప్ప పాల్గొన్నారు.

● చిలమత్తూరు: గ్రంథాలయ వారోత్సవాలు ఈనెల 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి మల్లికార్జున గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

వీఆర్వోల మండల కమిటీ ఎన్నిక



నూతన కమిటీ

గోరంట్ల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): వీఆర్వోల మండల కమిటీని గురువారం ఎంపిక చేశారు. గోరంట్లలోని తహసీల్దార్ కార్యాలయంలో సీఎస్‌డీటీ మనోహర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడిగా నాగరాజురావు, ఉపాధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ, కార్యదర్శిగా పవన్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా లక్ష్మీనరసమ్మ, కోశాధికారిగా కొండాపురం ప్రవీణ్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఘనంగా వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ

మడకశిర రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కదిరేపల్లి గ్రామంలో వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ గురువారం వైభవంగా జరిగింది. మహిళలు పెద్దఎత్తున జ్యోతులతో ఊరేగింపుగా వచ్చారు. కార్యక్రమంలో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు, ఎమ్మెల్యే రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

శ్రమదానంలో ఎన్‌ఎస్‌ఎస్ పీఓ జయప్ప

పెనుకొండ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఇళ్లవద్ద, వీధుల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఎన్‌ఎస్‌ఎస్ పీఓ జయప్ప పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో భాగంగా మంగాపురం గ్రామంలో ట్యాంకులవద్ద శుభ్రంచేసి పిచ్చిమొక్కలు తొలగించారు. వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీఓ ప్రతాప్, అధ్యాపకులు రామన్న, వలంటీర్లు పాల్గొన్నారు.

మడకశిర టౌన్(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఎస్‌వైటీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు నగర పంచాయతీ పరిధిలోని చౌటిపల్లిలో గురువారం 4వరోజు ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ క్యాంప్‌లో భాగంగా పరిసరాలను పరిశుభ్రం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో విద్యార్థులు గ్రామస్థులకు ఆరోగ్యం, పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. పాఠశాల ఆవరణంలో క్రీడా మైదానంలో పెరిగిన చెట్లను తొలగించారు. క్రీడలు ఆడేసమయంలో మైదానం పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ఈఓ నాగసాయిప్రసాద్, అధ్యాపకులు రఘునాథరెడ్డి, అనీల్‌కుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అనాథకు అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవరపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. అతడి ఆచూకీ తెలియకపోవడంతో రైల్వే పోలీసులు తెలుగుదేశం నాయకులు యుగంధర్‌కు సమాచారం అందించారు. దీంతో గురువారం మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీగది నుంచి తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.

యువకుడి ఆత్మహత్య

హిందూపురం, నవంబరు13(ఆంధ్రజ్యోతి): మండలంలోని మణేసముద్రానికి చెందిన శ్రీకాంత్(24) చెత్తసంపద కేంద్రంలో తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్యచేసుకున్న చేసుకున్నాడు. గురువారం మధ్యాహ్నం 3గంటల సమయంలో గ్రామ సమీపంలో ఉన్న చెత్తసంపద కేంద్రంలో ఉరివేసుకున్న విషయం స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. తమకు ఫిర్యాదు అందలేదని హిందూపురం అప్‌గ్రేడ్ పోలీసులు తెలిపారు.